తెలుగు దినపత్రిక
RNI TG TEL/ 26/A0381
# సిరి
People's Voice
వార్త పత్రిక
10-04-2026
శుక్రవారం హైదరాబాద్
సంపుటి: (volume): 1
సంచిక: (ISSUE): 72
PUBLISHED FROM HYDERABAD
పేజీలు-8 వెల:రూ.4 /–



## వృత్తి ధర్మం నేరమా?!

- గొంతు అద్దితే వ్యక్తిత్వ హననమా?
- పుట్టుపూర్వోత్తరాలంటూ బెదిరింపులా?
- వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ మధురవాణిపై వైసీపీ శ్రేణుల అసభ్య దాడి
- జీతం కోసం పనిచేసే ఎంప్లాయ్‌పై 'రాజకీయ' యుద్ధం
- సభ్య సమాజం తలదించుకునేలా అసభ్య పోస్టులు
- స్క్రిప్ట్ రాసింది ఒకరు.. చదివింది మరొకరు
- సంస్థ విధానాలకు ఉద్యోగి ఎలా బాధ్యురాలు?

5



## సమాజంలో మార్పునకు విద్యార్థి ఉద్యమమే నాంది

ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల
ఎన్ఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు

**హైదరాబాద్, ఏప్రిల్ 9:**

చదువు నేర్పిన వివేకం పోరాట పటిమగా మారినప్పుడే దేశ చరిత్ర మారుతుంది.. సమాజంలో ఏ విప్లవాత్మక మార్పు రావాలన్నా దానికి విద్యార్థి ఉద్యమమే తొలి అడుగు.. ఇది చరిత్ర నిరూపించిన సత్యం

మిగతా 2వ పేజీలో..

# జూన్ 2 నుంచి పాఠశాలల్లో అల్పాహారం



ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం
ప్రతీ బిడ్డ విద్యకి ఏ లోటూ లేకుండా చూస్తాం
డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

**బోనకల్లు, ఏప్రిల్ 9:**

ఏ ఆయుధమూ తెలంగాణ బిడ్డలను నిలబెట్టలేదంటూ అక్షరాన్ని ఆయుధంగా మలుచుకుని బాగా చదువుకుని ఉన్నత స్థితికి ఎదగాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క విద్యార్థులకు ఉద్బోధించారు. అక్షరం ద్వారానే అంతరాలు లేని ఆదర్శ సమాజం సాధ్యమవుతుందని స్పష్టం చేశారు. బోనకల్లు మండల కేంద్రంలో ప్రభుత్వ

మిగతా 2వ పేజీలో..



## ఆరేళ్లుగా పది రూపాయలే!!

- వాటి కోసం కూడా సంవత్సరాలుగా పడిగాపులు
- కాంట్రాక్టర్లకు కాసులు.. మాస్టార్లకు కన్నీళ్లు
- పదవతరగతి స్పాట్ వాల్యుయేషన్ డబ్బుల చెల్లింపులో సర్కారు జాప్యం
- పెండింగ్‌లో పది లక్షల పేపర్ల మూల్యాంకన డబ్బులు
- ప్రతి ఏటా నిరసనలు జరుగుతున్నా పట్టించుకోరా?

4



## యూనిఫామ్, అవినీతి కలిసి ఉండవు..!

పోలీసులకు డీజీపీ స్ట్రాంగ్ వార్నింగ్
అవినీతి ఆలోచనకు చోటు ఇవ్వొద్దు
వరుసగా ఏసీబీ దాడుల్లో పోలీసు సిబ్బంది పట్టుబడుతున్న ఘటనలపై తీవ్ర ఆందోళన
లంచాలు తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం

2

## తప్పు ఒప్పుకో..
### ప్రజలకు క్షమాపణ చెప్పు

- సీఎం సహా మంత్రులందరూ అవినీతిపరులేనన్న పొంగులేటి
- అవినీతి బట్టబయలయ్యే సరికి ఫ్రస్ట్రేషన్‌లో ఉన్నారు
- అందుకే తిట్ల దండకం ఎత్తుకున్నారు
- బీఆర్ఎస్ నేత హరీష్ రావు

2





## సమగ్ర ట్రామా కేర్ పాలసీ ప్రారంభం

రోడ్డు ప్రమాద బాధితులకు ఎంతో ఉపయుక్తం
కొండాపూర్‌లో క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి శంకుస్థాపన
మీడియాతో వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్

3

## రాష్ట్రం కోసం కేసీఆర్‌తో కలిసి పనిచేస్తా

- ఆయన పాలనే బెటర్



- నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకున్నారు
- తెలంగాణ ఏర్పాటు కేసీఆర్ వల్లనే సాకారమైంది
- మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- త్వరలో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన

3



## నిబద్ధత కలిగిన నేత జీవన్‌రెడ్డి

కేసీఆర్‌జీవన్‌ల అనుబంధం ఈనాటిది కాదు
సీఎం రేవంత్, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు
జగిత్యాల వెళ్లి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన కేటీఆర్

3

## ఎమ్మెల్యే పల్లాకు సైబర్ నేరగాడి బురిడీ

- కేంద్ర పథకం పేరు చెప్పి రూ.లక్ష లూటీ
- పోలీసులను ఆశ్రయించిన జనగామ ఎమ్మెల్యే



2



2

## పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

- సీఎస్ రామకృష్ణారావు



## నారీశక్తిని బలోపేతం చేద్దాం

- మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రధాని మోదీ పిలుపు

4

## జీవన్‌రెడ్డిని అన్ని విధాలా ఆదరించాం

- గతంలో కేసీఆర్ పాలనను విమర్శించింది మరిస్తే ఎలా
- మీడియాతో పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :**

మాజీ మంత్రి జీవన్‌రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరబోతున్న సందర్భంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పందించారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ చాలా చేసిందని ప్రస్తావించారు. ఆయనకు ఉన్నతమైన గౌరవం ఇచ్చిందన్నారు. జీవన్ రెడ్డికి కాంగ్రెస్ 14సార్లు బీఫాం ఇచ్చిందని గుర్తుచేశారు. గురువారం గాంధీ భవన్‌లో

మిగతా 3వ పేజీలో..





2

## ట్రాఫిక్ చిక్కుముడి విప్పేందుకు యత్నం

షేక్‌పేట నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు మోడల్ కారిడార్
బస్సుల్లో అధికారుల ప్రయాణం.. పరిస్థితుల అధ్యయనం

## రెచ్చిపోతున్న కబ్జారాయుళ్లు



- పాఠశాల ప్రహరీ, గదులు కూల్చడం దుర్మార్గం
- చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎంపీ రఘునందన్ వినతి

3

# యూనిఫామ్, అవినీతి కలిసి ఉండవు..!

- **పోలీసులకు డీజీపీ స్ట్రాంగ్ వార్నింగ్**
- **అవినీతి ఆలోచనకు చోటు ఇవ్వొద్దు**
- **వరుసగా ఏసీబీ దాడుల్లో పోలీసు సిబ్బంది పట్టుబడుతున్న ఘటనలపై తీవ్ర ఆందోళన**
- **హోంగార్డ్స్ నుంచి ఉన్నతాధికారుల వరకు నిజాయితీతో విధులు నిర్వర్తించాలని ఆదేశం**
- **లంచాలు తీసుకుంటే కఠిన చర్యలు తప్పవని స్పష్టం**

**హైదరాబాద్, ఏప్రిల్ 9:**

ఒంటిపై ఖాకీ డ్రెస్ ఉన్నప్పుడు మనసులో అవినీతి ఆలోచనకు చోటు ఉండకూడదని తెలంగాణ డీజీపీ శివధర్ రెడ్డి పోలీసు సిబ్బందికి కఠిన హెచ్చరికలు చేశారు. శాంతి భద్రతలు కాపాడాల్సిన వారే అక్రమ సంపాదనకు అలవాటు పడితే వ్యవస్థకు అంతకంటే చేటు మరొకటి లేదని స్పష్టం చేశారు. బాధ్యత మరవకండి, దారి తప్పకండి అంటూ సిబ్బందిని హెచ్చరించారు. అవినీతి చర్యలకు పాల్పడితే ACB కొరడాతో సిద్ధంగా ఉందని డిపార్ట్‌మెంట్‌కు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.

ఈ మధ్య వరుస దాడుల్లో పోలీసు సిబ్బంది ACBకి పట్టుబడుతున్న ఘటనలు పెరుగుతుండటంతో డీజీపీ తీవ్రంగా స్పందించారు. ఈ ఘటనలు పోలీస్ శాఖ ప్రతిష్టను మంటగలిపేలా ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడాల్సిన పోలీసులు అక్రమ సంపాదనకు అలవాటు పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

హోంగార్డ్స్ నుంచి ఉన్నతాధికారుల వరకు అందరూ బాధ్యతతో పని చేయాలని, నిజాయితీతో విధులు నిర్వహించాలని డీజీపీ శివధర్ రెడ్డి సూచించారు. దారితప్పి లంచాలు తీసుకుంటే కఠినచర్యలు తప్పవని మరోసారి స్పష్టం చేశారు. ఫెయిర్, ఫర్మ్, ఫ్రెండ్లీ, ప్రొఫెషనల్ విధానాలే పోలీసుల లక్ష్యమని సిబ్బందికి గుర్తుచేశారు.

ఇటీవల ఏసీబీకి పట్టుబడిన ఘటనలు కూడా పోలీసు శాఖలో కలకలం రేపుతున్నాయి. ఏప్రిల్ 7న RGIA ఔట్‌పోస్ట్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ కనకయ్య, ఎస్సై సిద్దేశ్వర్ రూ.33 లక్షలు తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు. మార్చి 9న మల్కాజ్‌గిరి సైబర్ క్రైమ్ విభాగానికి చెందిన ఎస్సై ప్రమోద్ గౌడ్, బాబ్ నాయక్ చెరో లక్ష రూపాయలు తీసుకుంటూ దొరికిపోయారు. ఫిబ్రవరి 10న మాదాపూర్ ఎస్సై వినయ్ రూ.50 వేల లంచంతో పట్టుబడ్డారు. గతేడాది నవంబర్ 12న ములుగు ఎస్సై విజయ్ రూ.50 వేలు తీసుకుంటూ బుక్కయ్యారు. నవంబర్ 18న మెదక్ ఎస్సై రాజేష్ రూ.30 వేలు తీసుకుంటూ దొరికిపోయారు. ఈ ఏడాది మార్చి 26న నిర్మల్ ఎస్సై అశోక్ రూ.20 వేల కోసం కక్కుర్తి పడి పట్టుబడ్డారు. జనవరి 8న వరంగల్ ఎస్సై శ్రీకాంత్ రూ.15 వేలు తీసుకుంటూ ఏసీబీ వలలో చిక్కారు. ఈ తరహా ఘటనలు పెరుగుతున్న నేపథ్యంలో యూనిఫామ్, కరప్షన్ ఒకేచోట ఉండవని డీజీపీ మరోసారి హెచ్చరించారు.

# పుష్కరాలకు విస్తృత ఏర్పాట్లు చేయాలి

**హైదరాబాద్, ఏప్రిల్ 9 :**



గోదావరి నదీ పుష్కరాలకు హాజరయ్యే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు కలగకుండా విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదేశించారు. గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సచివాలయంలో గురువారం సమీక్షా సమావేశం జరిగింది. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంత రావు, ఇతర ఉన్నతాధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ నిజామాబాద్ కందకుర్తి నుండి బాసర, భద్రాచలం వరకు 8 జిల్లాల్లో గోదావరి నదీ పరివాహక ప్రాంతం ఉందని, ఈ జిల్లాల్లో పుష్కర స్నానాలకు లక్షల సంఖ్యలో భక్తజనం వచ్చే అవకాశం ఉన్నందున పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేయాలని అన్నారు. ఈ పుష్కర ఏర్పాట్లపై ఇప్పటికే ముఖ్యమంత్రి తగు సూచనలు చేశారని, వారి ఆదేశాలకు అనుగుణంగా పుష్కర ఏర్పాట్లపై తగు ప్రతిపాదనలను రూపొందించి గోదావరి పుష్కరాలపై ఏర్పాటు చేసిన కేబినెట్ సబ్ కమిటీకి సమర్పించాలని సూచించారు. ఇప్పటికే నియమించిన ఈఎన్‌సీలు, చీఫ్ ఇంజనీర్ల కమిటీ ప్రతిపాదిత పుష్కర పనులను పరిశీలించాలని ఆయన ఆదేశించారు.

# సమాజంలో మార్పునకు విద్యార్థి ఉద్యమమే నాంది

**మొదటిపేజీ తరువాయి**

అని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పేర్కొన్నారు. అక్షరాన్ని ఆయుధంగా మలచుకొని, వ్యవస్థలోని లోపాలను ప్రశ్నించే ఆ చారిత్రక 'తొలి అడుగు'కు దశాబ్దాలుగా ఒక శక్తిమంతమైన వేదికగా నిలుస్తోంది ఎన్ఎస్‌యుఐ అని కొనియాడారు. దశాబ్దాలుగా విద్యార్థుల హక్కుల కోసం పోరాడుతూ ప్రజాస్వామ్య విలువల్ని కాపాడుతూ దేశానికి సమర్థవంతమైన నాయకత్వాన్ని అందించడంలో అది పోషిస్తున్న పాత్ర అనిర్వచనీయమని, స్ఫూర్తిదాయకమని ఆయన అన్నారు. ఎనఎస్‌యూఐ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్వేచ్ఛ, సమానత్వం, లౌకికవాదమే ప్రాతిపదికగా విద్యార్థి లోకాన్ని ముందుకు నడిపిస్తున్న కార్యకర్తలందరికీ తన హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. విజ్ఞానం కేవలం వ్యక్తిగత ఉన్నతికే కాదు.. సామాజిక విముక్తికి దారి చూపాలన్నారు. విలువల కోసం నిలబడే తత్వంతో ప్రతి విద్యార్థి నవ సమాజ నిర్మాణంలో భాగస్వామ్యం కావాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నానన్నారు.

# మొక్కజొన్న కొనుగోలు కేంద్రం ప్రారంభం

- **కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి : మంత్రి సీతక్క**

**మహబూబాబాద్, ఏప్రిల్ 9:**

జిల్లాలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలపై ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు గార్ల మండలం సీతంపేటలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంత్రి సీతక్క ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో రైతులు దోపిడీకి గురవుతున్నారని విమర్శలు వచ్చాయి. ప్రభుత్వం దృష్టికి వెళ్లడంతో కొనుగోలు కేంద్రాలపై ఫోకస్ పెట్టారు. ఈ మేరకు మంత్రి సీతక్క రంగంలోకి దిగారు. గురువారం మహబూబాబాద్ జిల్లా గార్ల మండలం సీతంపేటలో సీతక్క పర్యటించారు. అనంతరం స్థానిక రైతులతో మాట్లాడారు. వారి కోరిక మేరకు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మొక్కజొన్నలు ప్రైవేట్ దళారీలకు విక్రయించి మోసపోవద్దని ఈ సందర్భంగా రైతులకు మంత్రి సీతక్క వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.2,400 గిట్టుబాటు ధర కల్పించిందని తెలిపారు. మొక్కజొన్న రైతులు కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని విజ్ఞప్తి చేశారు. కొనుగోలు కేంద్రాలను అన్నదాతలు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి సీతక్క కోరారు. ఒక్క ఎకరాకు 25 క్వింటాలు మాత్రమే కొనుగోలు కాకుండా 50 క్వింటాలు పండించినా ప్రభుత్వమే కొనుగోలు చేసే విధంగా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు. రైతులు ఇబ్బంది పడకుండా పండించిన ప్రతి గింజను ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు.



# తప్పు ఒప్పుకో.. ప్రజలకు క్షమాపణ చెప్పు

**వనపర్తి, ఏప్రిల్ 9 :**



అత్యంత పవిత్రమైన సచివాలయంలో పొగురులేటి (మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి) మాటలు విన్నాం.. అంబేద్కర్, బిర్లా మందిరం, అమ్మవారు, మసీదు, చర్చి పక్కనే ఉన్నా నిజాలు దాచి అబద్ధాలు మాట్లాడారు అని బీఆర్ఎస్ నేత హరీష్‌రావు విమర్శించారు. వనపర్తి జిల్లా గొల్లపల్లి రిజర్వాయర్ వద్దంటూ నిరసన వ్యక్తం చేస్తున్న రైతులకు సంఘీభావం తెలిపారు. అనంతరం రేవల్లి మండలం నాగాపూర్ గ్రామంలో ఆయన మీడియాతో మాట్లాడారు. పొంగులేటి బూతులు వింటే ఆయన ఫ్రస్ట్రేషన్ తెలుస్తున్నది.. సరకు లేనపుడు, సమాధానం లేనపుడు తిట్లు ఎత్తుకుంటారు అని అన్నారు. పొగరులేటి డిఫెన్స్‌లో పడ్డాడు.. రాష్ట్ర మంత్రిగా కాకుండా రాఘవ కన్‌స్ట్రక్షన్ అధినేతగా మాట్లాడారు.. కొడుకును కాపాడుకునే ప్రయత్నంలో పిట్ట కబుర్లు చెప్పి బయటపడాలనుకున్నాడు.. నేనొక్కన్నే అవినీతిపరుడను కాదు...సీఎం, భట్టి, జూపల్లి కృష్ణారావు సహా మంత్రులందరి కుంభకోణాల చిట్టా ఆయనే చదివారు అని అన్నారు. పొంగులేటి కాదు.. పొంగు'లూటీ' అని ఆయనే చెప్పకనే చెప్పిండు.. రాఘవ కన్‌స్ట్రక్షన్స్‌లో జరిగిన అవినీతిని మా అధికారులే గుర్తుపట్టారు.. ఫైన్ కూడా కట్టారని ముఖ్యమంత్రి స్వయంగా చెప్పాడు.. అనుమతులు ఆలస్యం అవుతాయని మైనింగ్ మంత్రి చెప్పారు.. రెవెన్యూ, ఎలక్ట్రిసిటీ, పీసీబీ, మైనింగ్ శాఖల అధికారులు మైనింగ్ తనిఖీ చేసి అక్రమ మైనింగ్ అని నిర్ధారించారు.. పొంగులేటి చెప్పింది తప్పా.. అధికారులు చెప్పింది తప్పా.. ముఖ్యమంత్రి చెప్పింది తప్పా.. మైనింగ్ మంత్రి చెప్పింది తప్పా అని హరీశ్‌రావు ప్రశ్నించారు. నువ్వేమో సంబంధం లేదని చెప్తున్నావు.. పొగరులేటి నీవి ఇంకా చాలా ఉన్నాయి.. అన్నీ బయటపెడతాం అంటూ పొగరు తగ్గించుకో అని హితవు పలికారు. పొంగులేటి రాఘవకు మైనింగ్ లేదని ఎందుకు చెప్పలేదు... అసెంబ్లీలో ఉండి కూడా నాది కాదని చెప్పలేదు.. సీఎం, మైనింగ్ మంత్రిది తప్పు అని చెప్పు.. కంటైనర్ మీద రాఘవ కన్‌స్ట్రక్షన్ పేరు ఎందుకు ఉంది.. కాంగ్రెస్ జెండా ఎందుకు ఉంది అని నిలదీశారు. పిసిబి, మైనింగ్ అధికారులు నోటీస్ ఇస్తే మీ ఉద్యోగి తీసుకున్న కాపీని నేను అసెంబ్లీలో చూపెట్టాను.. అసెంబ్లీలో వాస్తవాలు ఎందుకు చెప్పలేదన్నారు. నాదర్‌గుల్ భూములు కాపాడింది బీఆర్ఎస్ పార్టీ.. నిషేధిత భూముల జాబితాలో పెట్టింది బీఆర్ఎస్.. హైకోర్టులో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం కొట్లాడింది.. సీలింగ్ భూములు అమ్మినవారి మీద, కొన్న వారి మీద చర్యలు తీసుకోవాలని ఆర్డర్స్ తెచ్చింది బీఆర్ఎస్.. ఎందుకు దాచిపెడుతున్నావు అని అన్నారు. డివిజన్ బెంచ్‌లో కేసు గెలిచింది బీఆరఎస్ ప్రభుత్వం కాదా అన్నారు. మీరు చెప్పినట్లు నేడు అవి ప్రభుత్వ భూములు అయితే రోజుకొక పేరు ఎందుకు మారుతుంది.. రెండున్నరేళ్లుగా భూమిని ఎందుకు స్వాధీనం చేసుకోలేదు.. ఎందుకు కంపెనీల బోర్డులు మారుతున్నాయి అని నిలదీశారు. శిల్పతో రాఘవ కంపెనీకి సంబంధాలున్నాయా లేవా? ఏ క్యూస్క్వేర్‌తో సంబంధాలు నిజామా కాదా అని అడిగారు. అవి ప్రభుత్వ భూములు అయితే హైడ్రా గడ్డి పీకుతున్నదా? ఆర్డీవో ఏం చేస్తున్నారు నిజాయతీ, చిత్తశుద్ధి ఉంటే అక్రమణదారులపై చర్యలు తీసుకోండి అని కోరారు. పొంగులూటి.. నీ బాంబులు అన్నీ తుస్సుమన్నాయి.. హైడ్రాను పంపి చిత్తశుద్ధి నిరూపించుకో.. తప్పు అయితే నాలుగు శాఖల మీద చర్యలు తీసుకో.. సీఎం అసెంబ్లీలో అబద్ధం ఆడారు అని చెప్పించు.. ఇప్పటికైనా తప్పు ఒప్పుకుని ప్రజలకు క్షమాపణ చెప్పు అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

# ట్రాఫిక్ చిక్కుముడి విప్పేందుకు యత్నం

**హైదరాబాద్, ఏప్రిల్ 9:**

భాగ్యనగరంలోని కీలకమైన షేక్‌పేట్ ఫ్లై ఓవర్ నుంచి మాసాబ్ ట్యాంక్ వరకు ట్రాఫిక్ కష్టాలను తీర్చి ఈ మార్గాన్ని 'మోడల్ కారిడార్'గా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వ యంత్రాంగం కసరత్తు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో గురువారం పర్యటించారు. అధికారులందరూ ఒకే బస్సులో ప్రయాణిస్తూ మార్గమధ్యలో ఉన్న బాటిల్ నెక్‌లు, నీరు నిలిచే ప్రాంతాలు, ఆక్రమణలను పరిశీలించి తక్షణ పరిష్కార మార్గాలను సూచించారు. ఎస్‌డిఐ హాస్పిటల్ వద్ద, బృందావన్ కాలనీ రోడ్ నంబర్ 1 వద్ద కొత్తగా ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను నిర్మించాలని నిర్ణయించారు. షేక్‌పేట్ నాలా వద్ద పెలికాన్ సిగ్నల్, జీబ్రా క్రాసింగ్‌లను ఏర్పాటు చేయనున్నారు. నానల్ నగర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ సాఫీగా సాగేందుకు వీలుగా అక్కడ ఉన్న రోటరీ వెడల్పును తగ్గించి రహదారిని విస్తరించాలని అధికారులను ఆదేశించారు. రేతిబౌలి నుంచి నానల్ నగర్ వరకు ఉన్న సెంట్రల్ డియన్‌ను, అడ్డంగా ఉన్న చెట్లను తొలగించి రోడ్డును వెడల్పు చేయనున్నారు. ఎనఎండీసీ, డెల్ స్టోర్ ప్రాంతాల్లో మాస్టర్ ప్లాన్ ప్రకారం భూసేకరణ చేపట్టి రహదారి విస్తరణ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రహదారి మధ్యలో ఉన్న రామాలయం ఆర్చ్, బొడ్రాయి, అలాగే షేక్‌పేట్ నాలా సపంలోని సమాధులను తొలగించి వాహనాల రాకపోకలకు మార్గం సుగమం చేయాలని కమిషనర్లు ఆదేశించారు. మాసాబ్ ట్యాంక్ ఫ్లై ఓవర్ వద్ద ఎత్తు పరిమితి బారియర్లు, హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయనున్నారు. మెహదీపట్నం వైపు ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను తరలించి, పోచమ్మ బస్తీ నుంచి రోడ్ నం.12కు నేరుగా వెళ్లేలా స్లిప్ రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేలా తక్షణమే చేయదగ్గ పనులు, దీర్ఘకాలిక పనులను గుర్తించామని సీపీ సజ్జనార్ తెలిపారు. నగరంలో ట్రాఫిక్ పనుల నిమిత్తం ప్రతి జోన్‌కు రూ.20 కోట్ల చొప్పున మొత్తం రూ.120 కోట్లు కేటాయిస్తున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ వెల్లడించారు. కేబీఆర్ పార్క్ వద్ద పెండింగ్‌లో ఉన్న పనులను రెండేళ్లలో పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డి.జోయల్ డెవిస్, జి.ముకుంద రెడ్డి, ప్రియాంక ఆలా, కాజల్, కె.శ్రీనివాస్, ఎస్.రత్నాకర్, వేణుగోపాల్ రెడ్డి, డి.ధనలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో సమ్మె సైరన్

- **ఈనెల 23 తర్వాత ఎప్పుడైనా బంద్**
- **ఈనెల 13 తర్వాత సమ్మెపై స్పష్టత ఇస్తామన్న ఆర్టీసీ జేఏసీ నేతలు**

**హైదరాబాద్ బ్యూరో:**

ఈనెల 23 తర్వాత ఎప్పుడైనా సమ్మెకు వెళ్లే అవకాశం ఉందని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ వెంకన్న, వైస్ ఛైర్మన్ థామస్ రెడ్డి స్పష్టం చేశారు. ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని కార్మిక శాఖ కార్యాలయంలో లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులతో ఆర్టీసీ జేఏసీ నేతలు సమావేశమయ్యారు. అయితే ఈ సమావేశానికి ఆర్టీసీ అధికారులు హాజరు కాకపోవడంతో సమ్మెపై పూర్తిస్థాయిలో చర్చ జరగలేదని తెలిపారు.

ఈనెల 13న మరోసారి లేబర్ కమిషనర్, ఆర్టీసీ యాజమాన్యంతో చర్చలు జరగనున్నాయని, ఆ తర్వాత సమ్మెపై పూర్తిస్థాయిలో స్పష్టత వస్తుందని జేఏసీ నేతలు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, యాజమాన్యం కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారించి సానుకూలంగా స్పందించాలని కోరారు. ఇప్పటికే కార్మిక శాఖకు, యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇచ్చినట్లు తెలిపారు.

మార్చి నెలలోనే సమ్మె నోటీసు ఇచ్చినా ప్రభుత్వం, యాజమాన్యం స్పందించలేదని జేఏసీ నేతలు విమర్శించారు. సుమారు 38 వేల మంది కార్మికులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, పనిభారం పెరగడం, ఉద్యోగ భద్రత లేకపోవడం వంటి సమస్యలు తీవ్రంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఎలక్ట్రిక్ బస్సుల పేరుతో సిబ్బందిని ఇతర జిల్లాలకు బదిలీ చేస్తున్నారని, ఆర్థిక సమస్యలు కూడా ఎదురవుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలన్నింటిని పరిష్కరించడంతో పాటు ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్యే పల్లాకు సైబర్ నేరగాడి బురిడీ

- **కేంద్ర పథకం పేరు చెప్పి రూ.లక్ష లూటీ**
- **పోలీసులను ఆశ్రయించిన జనగామ ఎమ్మెల్యే**

**జనగామ, ఏప్రిల్ 9 :**



సైబర్ నేరగాళ్ల చేతిలో సాధారణ ప్రజల నుంచి ఉన్నతమైనహోదాల్లో ఉన్నవారి వరకు ఎందరో మోసపోగా తాజాగా జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆ జాబితాలో చేరారు. ఈనెల 5న హైదరాబాద్‌లో ఉన్న రాజేశ్వర్‌రెడ్డికి ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేసి తాను ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీ అనంతరామిరెడ్డి అని పరిచయం చేసుకున్నాడు. కేంద్ర ప్రభుత్వ వికసిత్ భారత్ పథకం కింద నిరుద్యోగ యువతకు రూ.10 లక్షల వరకు రుణాలు ఇచ్చే అవకాశం ఉందని, నియోజకవర్గంలో 40 మంది అర్హులైన లబ్దిదారుల జాబితాను పంపాలని, దరఖాస్తుకు ఈరోజే చివరి రోజని ఎమ్మెల్యేపై ఒత్తిడి పెంచాడు. ఒక్కో దానికి ప్రాసెసింగ్ ఫీజు కింద రూ.2,500ల చొప్పున మొత్తం 40 మందికి రూ.లక్ష తక్షణమే ఫోన్ పే చేయాలని కోరాడు. ప్రజలకు మేలు జరుగుతుందనే ఉద్దేశంతో ఎమ్మెల్యే గంట వ్యవధిలోనే ఆ సొమ్మును నిందితుడు చెప్పిన నంబర్‌కు బదిలీ చేశారు. డబ్బులు పంపిన తర్వాత అటునుంచి ఎలాంటి స్పందన రాలేదు. దీంతో అనుమానం వచ్చి ఫైనాన్స్ అడిషనల్ సెక్రటరీకి ఫోన్ చేసి డబ్బులు వచ్చాయా అని అడిగారు. డబ్బులు రాలేదనే సమాధానంతోపాటు అసలు తాను ఫోన్ చేయలేదని ఆయన తెలిపారు. దీంతో మోసపోయినట్లు గుర్తించిన ఎమ్మెల్యే పల్లా జూబ్లీహిల్స్ పీఎస్ సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు జరుపుతున్నారు. ఉన్నతాధికారుల పేర్లతో ఫోన్ కాల్స్ వచ్చినప్పుడు వెంటనే నగదు బదిలీ చేయకుండా సంబంధిత శాఖల ద్వారా నిర్ధారించుకోవాలని పోలీసులు సూచించారు. ఏ ప్రభుత్వ పథకానికీ వ్యక్తిగత ఫోన్ పే నంబర్లకు డబ్బులు పంపాలని అధికారులు కోరరని తెలిపారు. చెల్లింపులు ఎప్పుడూ అధికారిక పోర్టల్స్ లేదా చలాన్ల ద్వారానే జరుగుతాయని తెలిపారు. ఇలాంటి అనుమానాస్పద కాల్స్ వస్తే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు.

# జూన్ 2 నుంచి పాఠశాలల్లో అల్పాహారం

**మొదటిపేజీ తరువాయి**



పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సైకిళ్లను గురువారం ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య ద్వారానే అభివృద్ధి సాధ్యమవుతుందని, ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల (ఎస్ఈఈఈపీసీ) సర్వేలో కూడా ఇది స్పష్టమైందని తెలిపారు. అర్ధాకలితో బడికి వెళ్లే విద్యార్థి చదువుపై ఏకాగ్రత చూపలేడనేది దృష్టిలో పెట్టుకుని రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని 20 లక్షల మంది విద్యార్థులకు జూన్ 2 నుంచి అల్పాహార పథకం ప్రారంభించనున్నట్టు ప్రకటించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఉచితంగా మధ్యాహ్న భోజనం అందించనున్నట్లు తెలిపారు. విద్య కోసం రాష్ట్ర ప్రభుత్వం వేల కోట్లు ఖర్చు పెడుతున్నదని, ఇది వృధా కాకూడదని ఆయన అన్నారు. రాష్ట్రంలో పుట్టిన ప్రతీ బిడ్డ తాను ఎంతవరకు చదువుకుంటే అంతవరకు సౌకర్యాలు కల్పించాలని, అద్భుతమైన మానవ వనరులుగా వారిని తీర్చిదిద్దాలని విద్యాశాఖను చూస్తున్న సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని డిప్యూటీ సీఎం తెలిపారు. ఆర్థిక వసతులు లేక, తల్లిదండ్రులు సహాయం చేయలేక చదువుకోలేకపోయాం అనే బాధ ఏ బిడ్డకూ ఉండొద్దనే ఉద్దేశంతో కార్పొరేట్ వసతులతో కూడిన విద్యను ఉచితంగా అందించాలని అంతర్జాతీయ విద్యా ప్రమాణాలతో 100 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం ప్రారంభించామని తెలిపారు. ఇంగ్లీష్ మీడియంలో బోధన, క్రీడా సౌకర్యాలు, డిజిటల్ బోధన, టీచింగ్, నాన్ టీచింగ్ స్టాఫ్ అక్కడే ఉండేలా క్వార్టర్లు సైతం నిర్మిస్తున్నామని, అన్ని వర్గాల విద్యార్థులు ఒకేచోట చదువుకునేలా, ఒక వసుదైక కుటుంబ భావన కలిగేలా వీటిని నిర్మిస్తున్నామని వివరించారు. అలాగే వచ్చే విద్యా సంవత్సరం నుంచి సెమీ రెసిడెన్షియల్ విధానంలో ప్రతి నియోజకవర్గంలో ఒక తెలంగాణ పబ్లిక్ స్కూల్ ప్రారంభిస్తున్నామని ఆయన ప్రకటించారు. కూలినాలి చేసుకునే తల్లిదండ్రులు గ్రామానికి వచ్చే ప్రైవేటు పాఠశాల బస్సులో తమ పిల్లలను పంపేందుకు ఆర్థికంగా భారానికి గురవుతున్నారని ప్రభుత్వం గుర్తించి వారికి చేయూతనిచ్చేందుకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు చెప్పారు. ఈ స్కూల్స్ వాహనాలు ఉదయాన్నే గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకొస్తాయని, పాఠశాలకు రాగానే అల్పాహారం, వారంలో మూడు రోజులపాటు పాలు, మూడు రోజుల పాటు రాగి జావ వంటి పోషక పదార్థాలు అందిస్తామని చెప్పారు. మధ్యాహ్న భోజనం, విద్యాబుద్ధులు నేర్పడం, పాఠశాల ముగిసిన తర్వాత విద్యార్థులను వారి ఇళ్ల వద్ద ఉచిత బస్సులో దింపనున్నట్లు తెలిపారు. ఈ స్కూల్స్‌లో క్రీడా, కంప్యూటర్, డిజిటల్ ఎడ్యుకేషన్ వంటి ఆధునిక సౌకర్యాలను కూడా అందుబాటులోకి తీసుకొస్తున్నామన్నారు. విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో తనకు తెలిసిన మిత్రులతో మాట్లాడి అమ్మ ఫౌండేషన్ ద్వారా బోనకల్లు, ఎర్రుపాలెం మండలాల్లో ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేపట్టినట్టు భట్టి విక్రమార్క తెలిపారు.

**విద్య కోసం 13.5 శాతం నిధులు : ఎర్రుపాలెంలో డిప్యూటీ సీఎం**

విద్యార్థుల భవిష్యత్తు, వారి ఎదుగుదలే రాష్ట్ర సంపూర్ణ ఎదుగుదలగా భావించి బడ్జెట్‌లో విద్యా శాఖకు 13.5 శాతం నిధులు కేటాయించి ప్రజా ప్రభుత్వం ముందుకు పోతున్నదని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. ఎర్రుపాలెంలో అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, ఇంటర్ విద్యార్థులకు సైకిళ్లను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం పదేళ్లపాటు విద్యార్థుల డైట్, కాస్మెటిక్ చార్జీలు పెంచలేదని, ప్రజా ప్రభుత్వం రాగానే ఆర్థిక భారం అయినప్పటికీ డైట్ చార్జీలను 40 శాతం, కాస్మెటిక్ చార్జీలను 200 శాతం పెంచామని తెలిపారు. మన సహజ వనరులు, మన మానవ వనరులను వజ్రాలుగా తీర్చిదిద్దేందుకు ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం వెనుకాడబోదన్నారు. విద్యార్థులు బాగా చదువుకొని రాష్ట్రాన్ని ఉన్నత స్థితిలో నిలపాలని కోరారు. విద్యార్థుల సమయం విలువైనదని, దాన్ని ఆదా చేయడంతోపాటు, వారికి శ్రమ ఉండకూడదన్న ఉద్దేశంతో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు అమ్మ ఫౌండేషన్ ద్వారా ఉచితంగా సైకిళ్లు పంపిణీ చేస్తున్నట్టు భట్టి తెలిపారు.

# జీవన్‌రెడ్డిని అన్ని విధాలా ఆదరించాం

**మొదటిపేజీ తరువాయి**

మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రజలు ఎన్నుకున్న నేత సీఎం రేవంత్‌రెడ్డి అని వ్యాఖ్యానించారు. రేవంత్‌రెడ్డి పోవాలి.. మార్పు రావాలి అనడానికి జీవన్ రెడ్డి ఎవరు అని ప్రశ్నించారు. కేసీఆర్ హయాంలో జరిగిన అవినీతి గురించి అనేకసార్లు జీవన్ రెడ్డి విమర్శించారని మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. వాటిని మరచి ఇవాళ కేసీఆర్‌ను పొగుడుతూ మాట్లాడడం సరికాదన్నారు. ఆయనకు ఇష్టం లేకపోతే చేసేదేమీ లేదని, కానీ విమర్శలకు కూడా ఓ హద్దు ఉండాలని అన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై వస్తున్న ఆరోపణలపై మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. పొంగులేటి అవినీతిపై ఆధారాలు ఉంటే చర్చకు రావాలని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. ఆధారాలు చూపిస్తే తప్పకుండా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆధారాలు ఉంటే పట్టుకొని గాంధీ భవన్‌లో చర్చకు రావాలని సవాల్ విసిరారు. బట్ట కాల్చి మీద వేస్తామంటే కుదరదని హెచ్చరించారు. కేసీఆర్ హయాంలోని పదేళ్లలో అప్పటి మంత్రులు చాలా దోచుకున్నారని ఆరోపించారు. జేబులు నింపుకొని ఈరోజు తమ మంత్రులపై విమర్శలు చేస్తారా అని ఆగ్రహించారు. ఆనాటి దోపిడీ గురించి కేసీఆర్ కూతురు కవితే చెబుతోందన్నారు. కేసీఆర్ హయాంలో నాసిరకం ప్రాజెక్టులు కట్టి డబ్బులు దోచుకున్నారని మహేశ్ కుమార్ గౌడ్ ధ్వజమెత్తారు.

# సమగ్ర ట్రామా కేర్ పాలసీ ప్రారంభం

**హైదరాబాద్, ఏప్రిల్ 9:**

రోడ్డు ప్రమాదాలు, ఇతర అత్యవసర పరిస్థితుల్లో బాధితులను తక్షణమే హాస్పిటల్స్‌కు తరలించి వారి ప్రాణాలు కాపాడేలా ప్రభుత్వం సమగ్ర ట్రామా కేర్ పాలసీని ప్రారంభించిందని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. ఇందులో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా జాతీయ, రాష్ట్ర రహదారుల వెంబడి అవసరమైన అన్ని వసతులతో 109 ట్రామా కేర్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కొండాపూర్‌లో వంద పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి ఎమ్మెల్యే అరికపూడి గాంధీతో కలిసి గురువారం శంకుస్థాపన చేసి అనంతరం విలేకరులతో మాట్లాడారు. రోడ్డు ప్రమాదం, ఇతర అత్యవసర పరిస్థితి ఏర్పడిన పది నిమిషాల లోపలే ఘటనా స్థలానికి చేరుకునేలా ఎమర్జెన్సీ రెస్పాన్స్ వ్యవస్థను బలోపేతం చేస్తున్నామని, ఇందులో భాగంగా 108అంబులెన్స్‌ల సంఖ్య పెంచుతున్నామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 31 క్రిటికల్ కేర్ బ్లాకులు ఏర్పాటు చేస్తున్నామని, నిజామాబాద్, నల్గొండ, కరీంనగర్, మహబూబాబాద్, జగిత్యాల్, సంగారెడ్డి, నారాయణపేట్, ఆదిలాబాద్‌లో క్రిటికల్ కేర్ బ్లాకులను ఇప్పటికే ప్రారంభించామని అన్నారు. మరో 21 సీసీబీల నిర్మాణం కొనసాగుతోందని, వీటన్నిటినీ ఈ ఏడాది చివరికి అందుబాటులోకి తీసుకొస్తామని వెల్లడించారు. కొండాపూర్‌లో రూ.41 కోట్లతో వంద బెడ్ల క్రిటికల్ కేర్ బ్లాక్ నిర్మాణానికి ఈరోజు శంకుస్థాపన చేశామని, వీలైనంత వేగంగా నిర్మాణం పూర్తి చేసి అత్యాధునిక వసతులతో వైద్య సేవలు అందించే విధంగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఐటీ కారిడార్‌లో సెడంటరీ లైఫ్ స్టైల్ కారణంగా అనారోగ్య సమస్యలు పెరుగుతున్నాయన్నారు. కొండాపూర్ ఏరియా హాస్పిటల్‌లో ఇక్కడి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, భవిష్యత్తులో మరిన్ని అత్యాధునిక వైద్య సేవలను అందుబాటులోకి తీసుకొస్తామని, ఇక్కడ నివసించే ప్రజలకు ఈ క్రిటికల్ కేర్ సేవలు ఎంతగానో ఉపయోగపడతాయని మంత్రి దామోదర్ తెలిపారు.

**చంచల్‌గూడ జైలులో**
**మూడు రోజుల వైద్య శిబిరం**

రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చంచల్‌గూడ జైలులో మూడు రోజులపాటు వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో ఖైదీలకు హెచఐవీ, టీబీ, ఇతర ఆరోగ్య పరీక్షలు చేసేందుకు ఆరోగ్య శాఖ ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రతి పౌరునికీ మెరుగైన వైద్య సేవలు అందించి, వారి ఆరోగ్య సంరక్షణే లక్ష్యంగా పనిచేస్తున్నామని తె□లిపారు. ఆరోగ్య వారోత్సవాల్లో భాగంగా రాష్ట్రవ్యాపంగా హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ క్యాంపులు గురువారం ఏర్పాటు చేశామన్నారు. జైళ్లలో ఉన్న ఖైదీల ఆరోగ్యాన్ని కాపాడే లక్ష్యంతో రాష్ట్రవ్యాప్తంగా జైళ్లలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేశామని, ఇకపై ప్రతీ మూడు నెలలకొకసారి జైళ్లలో స్పెషలిస్ట్ డాక్టర్లు, అవసరమైన డయాగ్నసిస్ సర్వీసులతో కూడిన హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేస్తామని చెప్పారు. ఆరోగ్యశాఖ, జైళ్ల శాఖ సమన్వయంతో పని చేస్తూ ఖైదీలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నాయన్నారు. తెలంగాణ జైళ్లను ఆశ్రమాల తరహాలో నిర్వహిస్తున్న జైళ్ల శాఖ అధికారులకు మంత్రి అభినందనలు తెలిపారు.

# రెచ్చిపోతున్న కబ్జారాయుళ్లు

- **పాఠశాల ప్రహరీ, గదులు కూల్చడం దుర్మార్గం**
- **చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు ఎంపీ రఘునందన్ వినతి**



**సంగారెడ్డి, ఏప్రిల్ 9:**

కాంగ్రెస్ రెండేళ్ల పాలనలో ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా కబ్జాలు చేస్తున్నారని బీజేపీ మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఆరోపించారు. బీఆరఎస్ పదేళ్ల పాలనలో కూడా ప్రభుత్వ భూములను కబ్జా చేశారని విమర్శించారు. వారి కబ్జాలపై విమర్శలు చేసిన కాంగ్రెస్ నేతలు ఇప్పుడు తామే కబ్జాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. గురువారం పటాన్‌చెరు పట్టణ కేంద్రంలో జాతీయ రహదారి విస్తరణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ రఘునందన్ మీడియాతో మాట్లాడారు. సర్వే నం. 428లో 2 ఎకరాల 18 గుంటల స్థలాన్ని కబ్జా చేసేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ప్రజాసంక్షేమాన్ని ద ష్టిలో పెట్టుకుని మాత్రమే జాతీయ రహదారుల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం పనిచేస్తోందని, కబ్జాదారులకు, జాతీయ రహదారి విస్తరణ పనులకు సంబంధం లేదని స్పష్టం చేశారు. ప్రభుత్వ పాఠశాల ప్రహరీ బయటనే జాతీయ రహదారి విస్తరణ చేయాల్సి ఉండగా తరగతి గదులను రాత్రికి రాత్రి కూల్చివేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులు స్పందించి పాఠశాల గదుల పాఠశాల కూల్చివేతలను అధికారులు సీరియస్‌గా తీసుకుని బాధ్యులపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు.

## ఇంటర్ ఫలితాల
# ప్రకటనపై దుష్ప్రచారం

**హైదరాబాద్, ఏప్రిల్ 9:**

తెలంగాణ ఇంటర్మీడియట్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం ఫలితాలు ఆలస్యం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయని సోషల్ మీడియాలో వార్తలు వస్తున్నాయి. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు అయోమయంలో పడ్డారు. ఈ ప్రచారాన్ని తెలంగాణ విద్యాశాఖ ఖండించింది. ఈ ప్రచారం అసత్యం.. అందులో ఎలాంటి వాస్తవం లేదని తెలిపింది. ఇంటర్ ఫలితాల ప్రకటన షెడ్యూల్ ప్రకారమే ఉంటుందని విద్యాశాఖ స్పష్టం చేసింది. గతంలో ఇంటర్ ఫలితాలు ఏప్రిల్ మొదటి వారంలో విడుదల కాలేదన్న విషయాన్ని గుర్తు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం ఒక పోస్ట్ పెట్టింది. గతంలో ఇంటర్ ఫలితాలు విడుదలైన తేదీలు.. 2014లో మే 3, 2015లో ఏప్రిల్ 22, 2016లో ఏప్రిల్ 22, 2017లో ఏప్రిల్ 16, 2018లో ఏప్రిల్ 13, 2019లో ఏప్రిల్ 18, 2020లో జూన్ 18 (కోవిడ్ కారణంగా అందరినీ పాస్ చేయటం జరిగింది), 2021లో జూన్ 28 (కోవిడ్ కారణంగా), 2022లో జూన్ 28, 2023లో మే 9, 2024లో ఏప్రిల్ 24, 2025లో ఏప్రిల్ 22న ప్రకటించారని తెలిపింది. ఇక జవాబు పత్రాల మూల్యాంకనం, ఇతర అంశాలనుబట్టి ఫలితాల విడుదల అయ్యే తేదీలు ఏటా మారుతుంటాయని విద్యాశాఖ తెలిపింది.

# రాష్ట్రం కోసం కేసీఆర్‌తో కలిసి పనిచేస్తా

- **నష్టపోయిన ప్రతి రైతునూ ఆదుకున్నారు**
- **తెలంగాణ ఏర్పాటు కేసీఆర్ వల్లనే సాకారమైంది**
- **మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు**
- **త్వరలో బీఆర్ఎస్‌లో చేరుతున్నట్లు ప్రకటన**



**జగిత్యాల, ఏప్రిల్ 9:**

తాను బీఆర్ఎస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్లు సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి తెలిపారు. జగిత్యాల వచ్చిన బీఆరఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్.. జీవన్ రెడ్డి ఇంటికి వచ్చి ఆయనను బీఆర్ఎస్‌లోకి కేసీఆర్ తరపున ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారిద్దరి భేటీ అనంతరం జీవన్‌రెడ్డి మీడియా సమావేశంలో మాట్లాడారు. తన శేష జీవితంలో కేసీఆర్‌తో పనిచేసే అవకాశం వచ్చిందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో కలిసి పనిచేస్తే రాష్ట్ర భవిష్యత్తుకు పాటుపడవచ్చన్నారు. 27 నెలలుగా కాంగ్రెస్ పార్టీలో చాలా క్షోభ అనుభవించానని, కాంగ్రెస్‌కు రాజీనామా చేసినప్పుడు భావోద్వేగానికి గురయ్యానని చెప్పారు. బీఆరఎస్ కంటే మెరుగైన పాలన అందిస్తారని కాంగ్రెస్‌కు ప్రజలు ఓటేశారు.. కానీ రెండేళ్ల పాలనలో రాష్ట్రం తిరోగమన దిశలో నడిచిందని విమర్శించారు. 2014లోనే కేసీఆర్ నాయకత్వంలో పనిచేసే అవకాశం వచ్చినప్పటికీ కాంగ్రెస్‌లోనే కొనసాగానన్నారు. రాష్ట్ర అవసరాల కోసం ఇప్పుడు బీఆరఎస్‌తో కలిసి పనిచేస్తానని జీవన్‌రెడ్డి తెలిపారు. కేసీఆర్ సూచన మేరకు పార్టీలోకి ఆహ్వానించేందుకు కేటీఆర్ తన ఇంటికి వచ్చారన్నారు. ప్రజాభిప్రాయం మేరకే బీఆరఎస్‌లో చేరుతానని చెప్పారు. తనను పార్టీలోకి ఆహ్వానించినందుకు కేసీఆర్, కేటీఆర్‌లకు హృదయపూర్వక ధన్యవాదాలు చెబుతున్నానన్నారు. ఎన్ని ప్రభుత్వాలనో చూశాను.. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం తిరోగమన దిశలో ఉందని వ్యాఖ్యానించారు. రెండు రోజుల్లో కేసీఆర్‌ను జీవన్‌రెడ్డి కలుస్తానన్నారని ఈ సందర్భంగా కేటీఆర్ తెలిపారు.

**రేవంత్ రెడ్డి పాలనపై తీవ్ర విమర్శలు**

రేవంత్ రెడ్డి పాలనకంటే కేసీఆర్ పాలన బాగుందని మాజీ మంత్రి జీవన్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను త్వరలోనే బీఆర్ఎస్‌లో చేరబోతున్నట్లు స్పష్టం చేశారు. గురువారం కేటీఆర్ రాకముందు మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయలేకపోతోందని, ఉద్యోగులు, నిరుద్యోగులను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ప్రజలు ఆశించిన పాలన రాలేదని వ్యాఖ్యానించారు. జాతీయ స్థాయిలో బీజేపీ బెటర్ అని, రాష్ట్రస్థాయిలో కేసీఆర్ మెరుగైన నాయకుడని అభిప్రాయపడ్డారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కేసీఆర్ వల్లే సాధ్యమైందని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. 1984లో కాంగ్రెస్‌లో చేరిన జీవన్‌రెడ్డి 43 ఏళ్లుగా ఉత్తర తెలంగాణలోనే కీలకమైన నాయకుడిగా గుర్తింపు పొందారు. ఆరుసార్లు ఎమ్మెల్యేగా గెలిచిన జీవన్‌రెడ్డి మూడుసార్లు రాష్ట్ర మంత్రిగా పనిచేశారు. 2014లో తెలంగాణ అవతరించిన తర్వాత ఉత్తర తెలంగాణ జిల్లాల నుంచి కాంగ్రెస్‌కు చెందిన ఏకైక ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 2018లో ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓటమి పాలైన జీవన్‌రెడ్డి 2019లో పట్టభద్రుల నియోజకవర్గం నుంచి ఎమ్మెల్సీగా గెలిచి శాసనమండలిలో ఏకైక కాంగ్రెస్ సభ్యుడిగా కొనసాగారు. జగిత్యాల నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా గెలిచిన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పార్టీలో చేర్చుకోవడంతో జీవన్‌రెడ్డి తీవ్ర మనస్తాపానికి గురయ్యారు. జీవన్‌రెడ్డి వర్గానికి ప్రాధాన్యత తగ్గడం, నామినేటెడ్ పదవుల కోసం ప్రతిపాదించిన వారికి పదవులను ఇవ్వకుండా ఎమ్మెల్యే సూచించిన వ్యక్తులకు ఇవ్వడం, ప్రధాన అనుచరుల్లో ఒకరు దారుణ హత్యకు గురికావడంతో జీవన్‌రెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో జగిత్యాల, రాయికల్ పట్టణాల్లో తన వర్గానికి చెందిన వారిని పక్కన పెట్టడంతో తీవ్ర ఆవేదనకు లోనైన జీవన్‌రెడ్డి గత నెల 25న కార్యకర్తలు, నాయకుల సమక్షంలో కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

# నిబద్ధత కలిగిన నేత జీవన్‌రెడ్డి

- **కేసీఆర్-జీవన్‌ల అనుబంధం ఈనాటిది కాదు**
- **సీఎం రేవంత్, ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు**
- **కేసీఆర్ మళ్లీ సీఎంగా రావాలంటున్న ప్రజలు**
- **జగిత్యాల వెళ్లి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించిన కేటీఆర్**

**జగిత్యాల, ఏప్రిల్ 9 :**

రాష్ట్రంలో రైతులు, పేదలు సంతోషంగా జీవించాలంటే కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రిగా రావాలి అని ప్రజలు కోరుకుంటున్నట్లు బీఆరఎస్ వర్కింగ్□ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. సీనియర్ నేత, కాంగ్రెస్ పార్టీ మాజీ ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డిని బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించేందుకు కేటీఆర్ జగిత్యాలలోని అయన నివాసానికి గురువారం వెళ్లారు. అంతకుముందు జగిత్యాల శివారులో బీఆరఎస్ శ్రేణులు కేటీఆర్‌కు స్వాగతం పలికాయి. అక్కడినుంచి బైక్ ర్యాలీతో జీవన్ రెడ్డి నివాసానికి చేరుకున్నారు. కేటీఆర్ రాకతో జీవన్ రెడ్డి నివాసంతోపాటు జగిత్యాల పట్టణం గులాబీమయంగా మారింది. పార్టీ నేతలు, ప్రజాప్రతినిధులతో కలిసి జీవన్ రెడ్డిని కలుసుకుని అధినేత కేసీఆర్ తరఫున అధికారికంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ తమ ఆహ్వానానికి జీవన్‌రెడ్డి సానుకూలంగా స్పందించారన్నారు. కేసీఆర్‌తో తనకు వ్యక్తిగత అనుబంధం ఉంది.. మీరు అందరూ వచ్చి ఆహ్వానించడం సంతోషంగా ఉంది.. త్వరలో కేసీఆర్‌ని కలిసి రెండుమూడు రోజుల్లో నా నిర్ణయం ప్రకటిస్తాను అని జీవన్‌రెడ్డి తెలిపినట్లు వెల్లడించారు. తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగాలంటే అనుభవజ్ఞులైన నాయకుల అవసరం ఉందని, అందుకే జీవన్ రెడ్డి సహకారం కోరుతున్నామని తెలిపారు. నాలుగు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌లో సేవలందించిన నిబద్ధత కలిగిన, నిజాయతీపరుడైన నాయకుడని కొనియాడారు. 2014లో కూడా కేసీఆర్ ఆయనను బీఆరఎస్‌లోకి ఆహ్వానించిన విషయాన్ని గుర్తు చేశారు. అప్పట్లో కాంగ్రెస్‌పై ఉన్న నిబద్ధతతో వారు అందులోనే కొనసాగారని చెప్పారు. కేసీఆర్‌జీవన్ రెడ్డి మధ్య నాలుగు దశాబ్దాలకుపైగా ఉన్న వ్యక్తిగత అనుబంధం, పరస్పర గౌరవం రాజకీయాలకు అతీతమని కేటీఆర్ వివరించారు. ఎలాంటి సంకోచం లేకుండా పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని జీవన్ రెడ్డిని పార్టీలోకి ఆహ్వానించేందుకు ముందుకొచ్చిన జగిత్యాల జిల్లా నాయకత్వానికి కేటీఆర్ కృతజ్ఞతలు తెలిపారు. జీవన్ రెడ్డి చేరిక కచ్చితంగా బీఆరఎస్‌కు అద్భుతమైన బలాన్ని చేకూరుస్తుందని చెప్పిన స్థానిక నాయకులు, జీవన్ రెడ్డిని ఆహ్వానించేందుకు వారు చేసిన కృషిని అభినందించారు. రెండు సందర్భాల్లో నా కండ్ల ముందు జరిగినయ్ గుర్తొస్తున్నాయన్నారు. 2014 జూన్ 2న కేసీఆర్ ముఖ్యమంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టిన తర్వాత జిల్లాల్లో వారి మొట్టమొదటి అధికారిక ప్రకటన ఉమ్మడి కరీంనగర్ జిల్లాతోనే మొదలైంది. జీవన్ రెడ్డి జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సీనియర్ నాయకుడు, ప్రతిపక్షానికి సంబంధించిన ఎమ్మెల్యే.. ఆరోజు కేసీఆర్ స్వయంగా ముందు జీవన్ రెడ్డికి మైక్ ఇవ్వండి అని చెప్పి వారికి మైక్ అందిస్తే నేరుగా అభినందనలు చెప్పి బోర్నపల్లి గ్రామానికి ఒక బ్రిడ్జి కావాలని ఒక్క మాట అడిగారు. అప్పుడే మేం కొత్తగా మంత్రులైనం. కేసీఆర్ ఎట్లా స్పందిస్తరు చూస్తా ఉన్నం. సాధారణంగా చూస్తాం.. పరిశీలిస్తాం అని చెప్పొచ్చు.. కానీ జీవన్ రెడ్డిపై ఉన్న గౌరవం, ప్రేమ ఎట్టాంటిదంటే కేసీఆర్ రూ.70 కోట్లతో కరీంనగర్ జిల్లాలోనే మొట్టమొదటి బ్రిడ్జిని మంజూరు చేశారని కేటీఆర్ తన అనుభవాన్ని వెల్లడించారు. అసెంబ్లీలో ఎప్పుడూ ప్రజా సమస్యల గురించి ముఖ్యంగా రైతుల తరపున చాలా గట్టిగా మాట్లాడే నాయకుడని కొనియాడారు. జగిత్యాల జిల్లాలో నిజాం షుగర్స్ చాలా ముఖ్యమైనదని.. దాన్ని ఖచ్చితంగా తెరిపించాల్సిందేనని విద్యాసాగర్ రావు, జీవన్ రెడ్డిలు కొట్లాడేవారు. షుగర్ ఫ్యాక్టరీని ఖచ్చితంగా తెరిపించాల్సిందే.. మేం కూడా మాటిస్తున్నాం. కానీ పక్కనే ఉన్న మహారాష్ట్రలో సహకార వ్యవస్థలో అక్కడి షుగర్ మిల్లులు చాలా బ్రహ్మాండంగా నడుస్తున్నయ్. టెస్కాబ్ చైర్మన్, మాజీ అధ్యక్షుడు రవీందర్ రావు కూడా ఇక్కడే ఉన్నరు. అట్లా కో ఆపరేటివ్ వ్యవస్థను బాగు చేస్తే బాగుంటది జీవన్ రెడ్డి గారూ.. ఒకవేళ మీకు కావాలనుకుంటే ప్రభుత్వం నుంచి రూ.250 నుంచి రూ.300 కోట్లు పెట్టేందుకు కూడా మేం సిద్ధంగా ఉన్నామని.. అవసరమైత మీరే దానికి చైర్మన్‌గా ఉండండి అని కేసీఆర్ ఎలాంటి భేషజానికి పోకుండా శాసనసభలో జీవన్ రెడ్డికి ఓపెన్‌గా చెప్పారని కేటీఆర్ గుర్తు చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం,**
**రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు**

కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. రెండున్నరేళ్లుగా పూర్తిగా వైఫల్య పాలనను కొనసాగిస్తోందని, ప్రజల దృష్టి మళ్లించేందుకు డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నదని కేటీఆర్ ఆరోపించారు. రైతు బంధు పథకాన్ని అమలు చేయకుండా రూ.27 వేల కోట్ల బకాయిలు పెడుతూ మరోవైపు రుణ మాఫీ పేరుతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని విమర్శించారు. రైతుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందన్నారు. ముఖ్యమంత్రి తన స్థాయి మరిచి మాట్లాడుతున్నారన్నారు. యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చి అమలు చేయకుండా యువతను మోసం చేశారన్నారు. నిరుద్యోగ యువతలో నిరాశ, ఆగ్రహం పెరుగుతోందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వ ఆరు గ్యారెంటీలలో ఒక్కటీ పూర్తిస్థాయిలో అమలు కాలేదని అన్నారు. ఆర్థిక పరిస్థితి తెలుసుకొని హామీలు ఇచ్చామని చెప్పి ఇప్పుడు వెనక్కి తగ్గడం ప్రజలను మోసం చేయడమేనన్నారు. కాంగ్రెస్ పార్టీ లోపలే అసంతృప్తి పెరుగుతోందని, ఆ పార్టీ కార్యకర్తలే బీఆరఎస్ ప్రభుత్వం తిరిగి రావాలని కోరుకుంటున్నారని చెప్పారు. కాంగ్రెస్ నాయకత్వం తమ సీనియర్ నేతలను అవమానిస్తూ వారి ఆత్మగౌరవాన్ని దెబ్బ తీస్తోందని విమర్శించారు. రేవంత్ రెడ్డి అధికారం మత్తులో అహంకారంగా వ్యవహరిస్తున్నారని, ప్రజా సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమయ్యారని అన్నారు. ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయిందన్నారు. బీఆరఎస్ పార్టీ మళ్లీ ప్రజల ఆశీస్సులతో అధికారంలోకి వస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశారు.

# తిరుమలలో పారిశుద్ధ్యానికి టీటీడీ పెద్దపీట

- **భక్తులకు నిరంతరాయంగా నాణ్యమైన పారిశుద్ధ్య సేవలు**
- **మొబైల్ వాటర్ ట్యాంకులతో శ్రీవారి సేవకుల ద్వారా తాగునీరు పంపిణీ**
- **టీటీడీ ఏర్పాట్లపై భక్తుల్లో సంతృప్తి**

**తిరుమల, ఏప్రిల్ 09, ఆంధ్ర మనం:**



తిరుమలలో భక్తుల ఆరోగ్యం, పారిశుద్ధ్యం, పర్యావరణ పరిరక్షణకు టీటీడీ పెద్ద పీట వేస్తోంది. రోజుకు సగటున 80 వేల నుండి 1 లక్ష మంది భక్తులు సందర్శిస్తున్న నేపథ్యంలో సుమారు 4.5 చదరపు కిలోమీటర్ల పరిధిలో పారిశుద్ధ్య నిర్వహణ సమర్థంగా కొనసాగుతోంది.

**పారిశుద్ధ్య నిర్వహణ విధానం**

పారిశుద్ధ్య నిర్వహణను మెరుగుపరచడానికి తిరుమల ప్రాంతాన్ని మూడు జోన్లుగా, ఏడు వార్డులుగా విభజించారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా తిరుమలలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించారు. అలాగే డి&ఓ ట్రేడ్ లైసెన్సులను నియంత్రించి నో స్టాక్ – నో గోడౌన్ లైసెన్సులను జారీ చేయడం జరుగుతోంది. వార్డు1లో శ్రీవారి ఆలయం పరిధిలో విభాగ సిబ్బంది ప్రత్యక్షంగా పనిచేస్తుండగా, వార్డు2 నుండి 7 వరకు పారిశుద్ధ్య పనులు మూడు కాంట్రాక్ట్ సంస్థల ద్వారా నిర్వహిస్తున్నారు.

**సమర్థవంతంగా చెత్త సేకరణ**

తిరుమలలో చెత్త సేకరణను సమర్థవంతంగా నిర్వహించేందుకు 9 టిప్పర్ వాహనాలు పనిచేస్తున్నాయి. రోజుకు సుమారు 45 ట్రిప్పులు చేసి, సుమారు 3,056 చెత్త బిన్స్ నుండి చెత్త సేకరణ జరుగుతోంది. అన్ని వాహనాలు కలిపి రోజుకు సుమారు 400 కిలోమీటర్ల మేరా ప్రయాణిస్తున్నాయి.

**2025 సంవత్సరానికి సంబంధించిన గణాంకాలు**

బయోడిగ్రేడబుల్ వ్యర్థాలు: 16,689.04 మెట్రిక్ టన్నులు.
నాన్ బయోడిగ్రేడబుల్ వ్యర్థాలు: 8,221.97 మెట్రిక్ టన్నులు.
మొత్తం వ్యర్థాలు: 24,911.01 మెట్రిక్ టన్నులు.

**మరుగుదొడ్ల సదుపాయాలు**

తిరుమలలో భక్తుల సౌకర్యార్థం వార్డు వారీగా విస్తృతంగా మరుగుదొడ్ల బ్లాకులు ఏర్పాటు చేశారు.

మొత్తం శాశ్వత టాయిలెట్ బ్లాకులు: 210.
సంస్థల టాయిలెట్లు: 130.
తాత్కాలిక టాయిలెట్లు: 14.
మొత్తం టాయిలెట్ బ్లాకులు: 354.

**మొబైల్ వాటర్ డ్రమ్స్ తో శ్రీవారి సేవకుల ద్వారా తాగునీరు పంపిణీ**

తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉండే పలు ప్రాంతాల్లో మొబైల్ వాటర్ డ్రమ్స్ ద్వారా శ్రీవారి సేవకులతో తాగునీరు పంపిణీ చేయడం జరుగుతోంది. వేసవి ప్రారంభమవ్వడంతో భక్తులు తాగునీటికి ఇబ్బంది పడకుండా నేరుగా భక్తుల వద్దకే శ్రీవారి సేవకులు వెళ్లి తాగునీరు అందిస్తున్నారు.

**నీరు, ఆహార నాణ్యత పర్యవేక్షణ**

టీటీడీ నీరు, ఆహార విశ్లేషణ ప్రయోగశాల 1981లో స్థాపించబడింది. ప్రస్తుతం ఎన్ ఎ బి ఎల్ గుర్తింపు పొందిన ఈ ల్యాబ్ భక్తులకు అందించే నీరు, ఆహారం నాణ్యతను కఠినంగా పరీక్షిస్తోంది. ప్రతిరోజూ లడ్డూ, అన్నప్రసాదం తయారీలో ఉపయోగించే పదార్థాల పరీక్షలు, నీటి నమూనాల విశ్లేషణ (రోజుకు సుమారు 20 నమూనాలు), నెలకు 1000-1200 నమూనాల పరీక్షలు, నెయ్యి నాణ్యత పరీక్షలకు ఆధునిక హ్ పి ఎల్ సి, జి సి యంత్రాలు వినియోగంలో ఉన్నాయి.

**కొత్త ఫుడ్ ల్యాబ్ ఏర్పాటు**

భారత ఆహార భద్రతా ప్రమాణాల సంస్థ ద్వారా ఇటీవల రూ.19.75 కోట్లతో అత్యాధునిక ఫుడ్ ల్యాబ్ ఏర్పాటు జరిగింది. ఆధునిక సాంకేతిక పరికరాలు ఏర్పాటు చేయడం జరిగింది. నాణ్యమైన పారిశుద్ధ్య సేవలపై భక్తుల్లో సంతృప్తి

తిరుమలలో టీటీడీ ఆరోగ్య విభాగం అందిస్తున్న నాణ్యమైన పారిశుద్ధ్య సేవలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. దేశంలో మరెక్కడా లేనివిధంగా టీటీడీ ఎప్పటికప్పుడు చెత్తను సేకరిస్తూ భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టడం, మరుగుదొడ్లను అనునిత్యం పరిశుభ్రంగా ఉంచడం వంటి చర్యలపై భక్తులు టీటీడీని ప్రశంసిస్తున్నారు. తిరుమలకు విచ్చేసే భక్తుల సంఖ్య ఎక్కువగా ఉన్నప్పటికీ, తిరుమలలో పారిశుద్ధ్య, చెత్త నిర్వహణ, మరుగుదొడ్ల సదుపాయాలు, ఆహార భద్రతను టీటీడీ అత్యంత సమర్థవంతంగా నిర్వహిస్తోంది. పర్యావరణ పరిరక్షణకు కట్టుబడి, భక్తులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణం అందించడమే లక్ష్యంగా టీటీడీ పని చేస్తోంది.

## నూతన కాలనీలకు మంచినీరు అందించాలి

### ఎమ్మెల్యే జీఎంఆర్

**రామచంద్రపురం, ఏప్రిల్ 9, ( సిరి న్యూస్ ):**



పటాన్‌చెరు నియోజకవర్గంలోని నూతన కాలనీలకు రక్షిత మంచినీరు అందించేందుకు నిధులు కేటాయించాలని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి జలమండలి ఎండి అశోక్ రెడ్డిని కోరారు. గురువారం హైదరాబాద్‌లో జరిగిన సమావేశంలో అమీన్పూర్ డివిజన్ పరిధిలోని కిష్టారెడ్డిపేట, రాజరాజేశ్వరి కాలనీ ఫేజ్–2, సృజన లక్ష్మీ కాలనీ ఫేజ్–4, టైలర్స్ కాలనీ, లింగమయ్య కాలనీ, కెఎస్ఆర్ కాలనీలలో నీటి సమస్యపై ఆయన దృష్టికి తీసుకెళ్లారు.కొత్త పైపులైన్ల కోసం రూ.2 కోట్లు మంజూరు చేస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. దీనికి సానుకూలంగా స్పందించిన ఎండి అశోక్ రెడ్డి త్వరలోనే నిధుల మంజూరుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## నేడే కేఎస్‌పీపీ నాలుగో స్నాతకోత్సవం

### ముఖ్య అతిథిగా హాజరుకానున్న అమితాబ్ కాంత్


**రామచంద్రపురం, ఏప్రిల్ 9 (సిరి న్యూస్):**



గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లోని కౌటిల్య స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ (కేఎస్‌పీపీ) నాలుగో స్నాతకోత్సవం శుక్రవారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నారు. 2026 బ్యాచ్‌కు చెందిన 35 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పట్టాలు అందుకోనున్నారు.ఈ కార్యక్రమానికి నీతి ఆయోగ్ మాజీ ముఖ్య కార్యనిర్వహణాధికారి, భారతదేశ జీ–20 షెర్పాగా పనిచేసిన అమితాబ్ కాంత్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.ఈ సందర్భంగా పట్టభద్రుల విజయాలను అభినందించడంతో పాటు ప్రజా విధానం, పరిపాలనా రంగాల్లో భవిష్యత్ నాయకులను తీర్చిదిద్దడంలో కేఎస్‌పీపీ నిబద్ధతను పునరుద్ఘాటించనున్నారు.

## పటాన్‌చెరు డివిజన్ కార్యాలయంలో విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమ్మె

### డిమాండ్లు పరిష్కరించాలంటూ ఆందోళన




**రామచంద్రపురం, ఏప్రిల్ 9, ( సిరి న్యూస్ ):**

రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల సమ్మెలో భాగంగా పటాన్‌చెరు డివిజన్ కార్యాలయంలో గురువారం ఆర్టిజన్ కార్మికులు సమ్మె చేపట్టారు. తమ సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు విధులను బహిష్కరించి ఆందోళనకు దిగారు.తెలంగాణ ట్రాన్స్‌కో, తెలంగాణ జెన్‌కో, టీజీఎస్‌పీడీసీఎల్, టీజీ ఎన్పీడీసీఎల్ పరిధిలో కొనసాగుతున్న సమ్మెకు మద్దతుగా పటాన్‌చెరు డివిజన్ ఉద్యోగులు కూడా ఆందోళనలో పాల్గొన్నారు.విద్యుత్ సంస్థల్లో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని, సేవా నియమావళి అమలు చేయాలని, పెండింగ్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఉద్యోగులు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేర్చే వరకు సమ్మె కొనసాగిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో జేఏసీ పటాన్‌చెరు అధ్యక్షులు పార్వయ్య, కార్యదర్శి రఘు, భూపాల్ రెడ్డి, గోపి, రబ్బా, అమేర్, రవీందర్ నాయక్, అరుణ్ రెడ్డి, సాయి గౌడ్, కవిత, శివలీల, నవీన్ చారి తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐఆర్ సమావేశంలో పాల్గొన్న కొల్కూరి నర్సింహారెడ్డి



**రామచంద్రపురం, ఏప్రిల్ 9 (సిరి న్యూస్):**

ఎస్ఐఆర్ (Special Intensive Revision) కార్యక్రమంలో భాగంగా పటాన్‌చెరు పట్టణ బూత్ లెవల్ ఏజెంట్లు, అధికారుల సమావేశం గురువారం రుద్రారం గీతం యూనివర్సిటీలో నిర్వహించారు. ఈ సమావేశానికి పటాన్‌చెరు పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కొల్కూరి నర్సింహారెడ్డి హాజరయ్యారు.ఏప్రిల్ నెల నుంచి ఇంటింటి సర్వే ద్వారా ఓటర్ల వివరాలను సేకరించనున్న నేపథ్యంలో అర్హులైన ఓటర్లు ఓటు హక్కు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ పీసీసీ కార్యదర్శి మతిన్, యువరాజ్ మోరే, అక్తర్, సాయి అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# ఆరేళ్లుగా పది రూపాయలే!!

- వాటి కోసం కూడా సంవత్సరాలుగా పడిగాపులు
- కాంట్రాక్టర్లకు కాసులు.. మాస్టార్లకు కన్నీళ్లు
- పదవతరగతి స్పాట్ వాల్యూయేషన్ డబ్బుల చెల్లింపులో సర్కారు జాప్యం
- పెండింగ్‌లో పది లక్షల పేపర్ల మూల్యాంకన డబ్బులు
- రాష్ట్రవ్యాప్తంగా గళమెత్తుతున్న ఉపాధ్యాయ లోకం
- ప్రతి ఏటా నిరసనలు జరుగుతున్నా పట్టించుకోరా?




**హైదరాబాద్ సిరి న్యూస్ (ప్రత్యేక ప్రతినిధి ):**

ఆరేళ్లుగా పది రూపాయల పారితోషికం.. అది కూడా ఏడాది దాటితే గానీ చేతికి అందని పరిస్థితి! పదవ తరగతి స్పాట్ వాల్యుయేషన్ డబ్బుల చెల్లింపులో ప్రభుత్వం చేస్తున్న జాప్యంపై ఉపాధ్యాయ లోకం ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ప్రతి ఏటా నిరసనలు జరుగుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా పదవ తరగతి పరీక్షా పేపర్లు దిద్దిన ప్రతి స్పాట్ సెంటర్‌లోనూ ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. గత రెండేళ్లుగా ప్రతి సంవత్సరం ఉపాధ్యాయులు ఇలా నిరసన తెలపడం ఒక పరిపాటిగా మారింది. ఒక్కో పేపర్ దిద్దితే వచ్చే స్వల్ప మొత్తమైన పది రూపాయల కోసం ఏడాది పొడవునా వేచి చూడాలా అనే వేదన ఉపాధ్యాయుల్లో కనిపిస్తోంది. ఒకప్పుడు స్పాట్ వాల్యుయేషన్ జరిగే చోటే నగదు చెల్లింపులు జరిగేవని, కానీ ఇప్పుడు ఆ సంప్రదాయాన్ని మార్చి ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**చెల్లింపుల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం**

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి సంవత్సరం పదవ తరగతి పరీక్షలు పూర్తి కాగానే, ఆయా జవాబు పత్రాలను ఒక్కో జిల్లా నుండి వేర్వేరు జిల్లాలకు తరలిస్తారు. అక్కడ వచ్చిన జవాబు పత్రాల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను మూల్యాంకనానికి ఎంపిక చేస్తారు. ఈ ప్రక్రియలో ప్రతి పేపర్‌కు కేవలం పది రూపాయలు మాత్రమే చెల్లిస్తారు. అలాగే జూనియర్ ఉపాధ్యాయులకు 300 రూపాయలు, సీనియర్ ఉపాధ్యాయులకు 400 రూపాయల చొప్పున డీఏ కేటాయిస్తారు. ఇలా ఒక్కో జిల్లాలో సగటున 10 నుంచి 12 వేల పేపర్ల వాల్యుయేషన్ జరుగుతుంది. మొత్తం మీద లక్షలాది మంది విద్యార్థుల పేపర్లను వేలాది మంది ఉపాధ్యాయులు అత్యంత బాధ్యతతో దిద్దుతుంటారు. అయితే ఇంతటి కీలకమైన విధులను నిర్వర్తిస్తున్న సిబ్బందికి చెల్లింపుల విషయంలో మాత్రం ప్రభుత్వం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోంది.

**బడ్జెట్ కేటాయింపులోనూ వింత పోకడలే..**

మరోవైపు పేపర్ వాల్యుయేషన్ బడ్జెట్ కేటాయింపుల్లోనూ వింత పోకడలు కనిపిస్తున్నాయి. ఈ మొత్తం ప్రక్రియ కోసం ప్రభుత్వం సుమారు 15 కోట్ల రూపాయల బడ్జెట్ కేటాయిస్తోంది. ఇందులో సమాచారాన్ని కంప్యూటరీకరణ చేయడం వంటి సాంకేతిక పనులకు దాదాపు 3 కోట్లు కేటాయిస్తారు. ఈ పనులను టెండర్ల ద్వారా కాంట్రాక్ట్ సంస్థలకు అప్పగిస్తారు. విచిత్రమేమిటంటే, టెండర్ దక్కించుకున్న కాంట్రాక్టు సంస్థలకు సకాలంలో చెల్లింపులు జరుగుతున్నాయని, కానీ వాస్తవంగా పేపర్లు దిద్దే బోధన సిబ్బందికి ఇవ్వాల్సిన డబ్బులు మాత్రం విడుదల చేయడం లేదన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. మొత్తం బడ్జెట్‌లో ఉపాధ్యాయులు, పర్యవేక్షక అధికారులు మరియు ఇతర సిబ్బందికి అందాల్సిన 12 కోట్ల రూపాయలను పెండింగ్‌లో పెట్టడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**ఉపాధ్యాయుల నిరసన బాట**

తమకు రావాల్సిన తక్కువ మొత్తాన్ని కూడా ఏడాది వరకు ఆపి ఉంచడంతో ఉపాధ్యాయులు నిరసన బాట పట్టారు. గత వారం రోజులుగా మహబూబ్ నగర్, నల్గొండ, హైదరాబాద్, మెదక్, కరీంనగర్ తో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో లంచ్ బ్రేక్ సమయంలో ఉపాధ్యాయులు నిరసనలు తెలుపుతున్నారు. రాష్ట్ర బడ్జెట్‌లో కోట్ల రూపాయల కేటాయింపులు జరుగుతుంటే, కేవలం 12 కోట్ల రూపాయల వాల్యుయేషన్ చెల్లింపులను ఎందుకు నిలిపివేస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. కరోనా మహమ్మారికి ముందు వరకు ఈ చెల్లింపులు చాలా వేగంగా, వెనువెంటనే జరిగేవని, కానీ కరోనా తర్వాత బడ్జెట్ కేటాయింపులు ఉన్నప్పటికీ చెల్లింపులు జరగడం లేదని వారు వాపోతున్నారు.

**ఇంటర్మీడియట్ కు అలా టెన్త్ కు ఇలా**

ఇక్కడ ఇంకో చిత్రం ఏంటంటే బోర్డు అఫ్ ఇంటర్మీడియేట్ నిర్వహించే ఇంటర్ పేపర్ వాల్యుయేషన్ కు మాత్రం 30 రూపాయల చొప్పున ఇస్తున్నారు.టెన్త్ కు మాత్రం 10 రూపాయలు అది రెండేళ్లు చేస్తే ఏడాదికి ఇస్తారు.అక్కడ డిఏ 1000 ఇక్కడ మాత్రం 400 వాళ్లకు మాత్రం చెల్లింపులు సరిగా ఉంటాయి.ఒకే ప్రభుత్వం లో ఒక్కో శాఖకు ఒక్కో న్యాయమా ?కేవలం మమ్మల్ని మాత్రం ఇబ్బంది పెడుతారన్నది ఉపాధాయ్యుల నిరసన వ్యక్తం చేస్తున్నారు .ఒకప్పుడు 6.50 పైసలున్న పేపర్ రేట్ ఎంతో పోరాడితే మూడేళ్ళ క్రితం పది రూపాయలు చేసారు.అ డబ్బులకు కూడా నిరసనలు చేయాల్సి వస్తుందన్నది ఉపాధ్యాయుల వాదన.ఇది ఇలాగె కొనసాగితే వచ్చే ఏట స్పాట్ వాల్యుయేషన్ కి ఉపాధ్యాయులు రాకపోవచ్చు.ఇకనైనా ప్రభుత్వం స్పందించి బిల్లులు చెల్లించాలని నిరసనల ద్వారా ప్రభుత్వాన్ని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

## కొంపల్లి డివిజన్ లో పర్యటించిన సైబరాబాద్ కమిషనర్ సృజన





**కొంపల్లి.ఏప్రిల్,08(సిరి న్యూస్).**

కొంపల్లి డివిజన్ పరిధిలోని జయభేరి పార్క్ మరియు పలు కాలనిలో గురువారం నాడు సైబరాబాద్ కమిషనర్ సృజన IAS మరియు కొంపల్లి సర్కిల్ డిప్యూటీ కమిషనర్ కృష్ణారెడ్డిలు కలిసి పలు సమస్యలను పరిశీలించారు.వర్షపు నీటితో కాలనీలు పూర్తిగా నిండిపోవడంతో కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యలపై కొంపల్లి మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు.మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి బైరి ప్రశాంత్ గౌడ్ ఇచ్చిన ఫిర్యాదుతో వారితో కలిసి పర్యటించారు.సమస్యలను కాలనీవాసులతో కలిసి కమిషనర్ సృజన దృష్టికి తీసుకెళ్లారు.స్పందించిన ఆమె వెంటనే NH–44 నుండి మొదలుకొని జయభేరి కాలనీ మీదుగా ఫాక్ససాగర్ వరకు వర్షపు నీరు నిల్వకుండా పైపులైన్ వేసే విధంగా డి .పి.ఆర్ సిద్ధం చేయాలని మున్సిపల్ ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించారు.ముఖ్యంగా న్యూ మార్క్ పృథ్వి అపార్ట్మెంట్స్ దగ్గర నీరు నిల్వకుండా మార్గాన్ని చూపాలని అపార్ట్మెంట్ వాసులతో కలిసి విన్నవించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కొంపల్లి డివిజన్ కాంగ్రెస్ నాయకులు జయభేరి గోపాల్ రెడ్డి ,అశోక్ రెడ్డి,పృథ్వి హోమ్ అధ్యక్షులు రమేష్ రెడ్డి కాలనీ వాసులు పాల్గొనడం జరిగింది.

## అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి





- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు.

**మెదక్‌ఏప్రిల్,09(సిరిన్యూస్)**

ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా వచ్చే సోమవారం నుంచి, అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అధికారులను ఆదేశించారు.ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమం నిర్వహణపై, సీఎస్ రామకృష్ణారావు, రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి, సంబంధిత శాఖల ఉన్నతాధికారులతో కలిసి హైదరాబాదు నుంచి, అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలు, అధికారులతో గురువారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఎస్ మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాల బారిన పడి ప్రజలెందరో ప్రాణాలు కోల్పోతున్నారని, అరైవ్ అలైవ్ కార్యక్రమం నిర్వహించడం ద్వారా గ్రామీణ ప్రాంతాల ప్రజలకు సైతం ట్రాఫిక్ నియమాలు, రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి రోడ్డు ప్రమాదాలను తగ్గించవలసిన అవసరం ఉందన్నారు. డిజిపి శివధర్ రెడ్డి మాట్లాడుతూ, అధికారులు అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించి, రోడ్డు భద్రత పై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ ఎస్పీ... డి.బి శ్రీనివాసరావుఅధికారులతో కలిసి పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ, ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 13 వ తేది నుంచి నిర్వహించే అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 13వ తేదీన గ్రామీణ స్థాయిలో, గ్రామ సభలు నిర్వహించి, రోడ్డు భద్రతా నియమాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లా ఎస్పీ .డి. వి శ్రీనివాసరావు. మాట్లాడుతూ, అరైవ్ అలైవ్ వీక్ కార్యక్రమంలో పోలీసులు, అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలన్నారు. ట్రాఫిక్ నియమాలపై ప్రజలలో అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చునని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# వృత్తి ధర్మం నేరమా?!

## గొంతు అద్దితే వ్యక్తిత్వ హననమా?

- పుట్టుపూర్వోత్తరాలంటూ బెదిరింపులా?
- వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్ మధురవాణిపై వైసీపీ శ్రేణుల అసభ్య దాడి
- జీతం కోసం పనిచేసే ఎంప్లాయ్‌పై 'రాజకీయ' యుద్ధం
- సభ్య సమాజం తలదించుకునేలా అసభ్య పోస్టులు
- స్క్రిప్ట్ రాసింది ఒకరు.. చదివింది మరొకరు
- సంస్థ విధానాలకు ఉద్యోగి ఎలా బాధ్యురాలు?
- మధురవాణిపై జరుగుతున్న దాడిపై మేధావుల ఆగ్రహం
- అండగా నిలవాల్సిన సమయం ఆసన్నమైంది



**సిరి న్యూస్, ప్రత్యేక ప్రతినిధి:**

ఒక సంస్థలో పనిచేసే ఉద్యోగికి ఆ సంస్థే జీవనాధారం. యజమాని నిర్దేశించిన విధులను నిర్వర్తించడం ప్రతి ఎంప్లాయ్ బాధ్యత. అయితే, రాజకీయ రంగు పులుముకున్న వివాదాల్లోకి ఏమాత్రం సంబంధం లేని ఒక వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్‌ను లాగి, ఆమె వ్యక్తిత్వాన్ని కించపరచడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ఏబీఎన్ ఛానల్‌లో 'వీకెండ్ కామెంట్ బై ఆర్కే' కార్యక్రమానికి వాయిస్ ఇచ్చిన మధురవాణిపై జరుగుతున్న దాడులు సామాన్య ఉద్యోగుల భద్రతపై ప్రశ్నలు రేకెత్తిస్తున్నాయి.

**ఒక సామాన్య ఉద్యోగి బాధ్యత ఎంత?**

మధురవాణి ఒక ప్రొఫెషనల్ వాయిస్ ఓవర్ ఆర్టిస్ట్. ఆమె పని కేవలం తనకు అప్పగించిన కాగితంపై ఉన్న అక్షరాలకు గొంతును అందించడం మాత్రమే. మీడియా సంస్థల్లో స్క్రిప్ట్ రాసే విభాగం వేరుగా ఉంటుంది. అక్కడ ఏం రాయాలి, ఏ అంశాన్ని ప్రస్తావించాలి అనేది ఎడిటర్లు, యాజమాన్యం నిర్ణయిస్తారు. జీతం తీసుకునే ఒక సామాన్య ఉద్యోగికి ఆ స్క్రిప్ట్‌ను సవరించే అధికారం కానీ, తిరస్కరించే సదుపాయం కానీ ఉండవు. కేవలం తన వృత్తి ధర్మాన్ని నిర్వహించినందుకు ఆమెను టార్గెట్ చేయడం అంటే, ఒక పోస్ట్ మ్యాన్ తెచ్చిన ఉత్తరంలోని సమాచారం నచ్చలేదని పోస్ట్ మ్యాన్‌పై దాడి చేయడమే అవుతుంది.

**రాజకీయ కక్షల మధ్యలో మహిళ బలిపశువు**

రాజకీయ పార్టీల మధ్య ఎన్ని వైషమ్యాలు ఉన్నా అవి నాయకుల మధ్యనో లేదా విధానాల మధ్యనో ఉండాలి. కానీ, ఒక సాధారణ వేతన జీవిని ఇందులోకి లాగడం అత్యంత దుర్మార్గం. ఒక మహిళ అని కూడా చూడకుండా ఆమె ఫొటోలను అసభ్యకరమైన క్యాప్షన్లతో సోషల్ మీడియాలో వైరల్ చేయడం, ఆమె ఫోన్ నంబర్లు సేకరించి బెదిరింపులకు పాల్పడటం సభ్య సమాజం తలదించుకునే చర్య. 'జీతం కోసం దిగజారుతావా' అని ప్రశ్నించే వారు, తన వృత్తిని నమ్ముకుని గౌరవంగా బతుకుతున్న ఒక స్త్రీ ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారని గమనించాలి.

**సోషల్ మీడియాలో వ్యక్తిత్వ హననం**

'రాజ్యాంగం' వంటి పేర్లతో నడిచే ఫేస్‌బుక్ పేజీల్లో మధురవాణి పుట్టుపూర్వోత్తరాలంటూ పోస్టులు పెట్టడం, ఏకవచనంతో దూషించడం అనాగరికతకు పరాకాష్ట. ఆమెకూ ఒక కుటుంబం ఉంటుందని, ఇటువంటి పోస్టుల వల్ల ఆ కుటుంబ సభ్యులు ఎంతటి మానసిక వేదనకు గురవుతారో ఈ దాడి చేస్తున్న వారు ఆలోచించాలి. విమర్శించాలనుకుంటే సంస్థ విధానాలను విమర్శించాలి తప్ప, గొంతును అద్దిన కళాకారిణిని కాదు.

**ప్రజాస్వామ్యమా? అరాచకమా?**

నచ్చని విషయాన్ని చెప్పినప్పుడు అభ్యంతరం తెలపడానికి చట్టపరమైన మార్గాలు ఉన్నాయి. కానీ, వ్యక్తిగత వేధింపులకు దిగడం, అసభ్య పదజాలంతో దూషించడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు. ఇది ముమ్మాటికీ భావప్రకటనా స్వేచ్ఛను అణచివేయడమే కాకుండా, మహిళా ఉద్యోగుల మనోధైర్యాన్ని దెబ్బతీయడమే. ఇలాంటి ధోరణిని ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉంది.

# ఆసాంఘిక కార్యకలాపాలపై నిఘా.!






- మెదక్ టౌన్ పోలీస్ స్టేషన్ ను ఆకస్మిక తనిఖీ
- సాయంత్రం వాహనాల తనిఖీలు తప్పనిసరి.
- మెదక్ జిల్లా ఎస్పీ. డి. వి. శ్రీనివాస రావు

**మెదక్ ఏప్రిల్, 09(సిరిన్యూస్)**

జిల్లాలో ఆసాంఘిక కార్యక్రమాలపై నిఘా పెట్టాలని జిల్లా ఎస్పీ డి. వి శ్రీనివాస రావు అన్నారు.గురువారం మెదక్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను పరిశీలించిన ఆయన పరిశుభ్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్టేషన్ రికార్డులను తనిఖీ చేస్తూ అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరిస్తూ, ఎలాంటి పెండెన్సీ లేకుండా చూడాలని, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజలకు త్వరగా న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.సీసీ కెమెరాల పనితీరుపై ఎస్‌హెచ్‌ఓ మహేష్ నుండి వివరాలు తెలుసుకొని, సీసీ కెమెరాలు సక్రమంగా పనిచేసేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ట్రాఫిక్ నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని, ప్రతిరోజూ సాయంత్రం వాహనాల తనిఖీలు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఎస్పి విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేయాలని హితవు పలికారు.అప్పగించిన విధులను సమయానికి పూర్తి చేయాలని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీస్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఆసాంఘిక కార్యకలాపాలపై నిఘా పెంచాలని, సామాజిక విఘాతం కలిగించే అంశాలపై ముందస్తు సమాచారం సేకరించేందుకు పటిష్టమైన సమాచార వ్యవస్థను ఏర్పాటుచేయాలని సూచించారు.ఈ సందర్భంగా ఎస్పీ గారి వెంట మెదక్ టౌన్ ఇన్స్పెక్టర్ మహేష్, ఎస్బి ఇన్స్పెక్టర్ సందీప్ రెడ్డి, ఎసై లు మల్లికార్జున్, విఠల్ సిబ్బంది ఉన్నారు.

## రేషన్ డీలర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించిన తహసిల్దార్

**వెల్దుర్తి ఏప్రిల్, 09 (సిరి న్యూస్):**

వెల్దుర్తి మండల కేంద్రంలో గురువారం మండలంలో గల (25)రేషన్ దుకాణాల డీలర్లతో మండల తహసిల్దార్ శ్రీనివాస్ సమావేశం నిర్వహించారు. ఇట్టి సమావేశం లో అందరు 3 నెలల రేషన్ బియ్యం వచ్చినందున రేషన్ కార్డు దారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా టోకాన్ పద్ధతి ద్వార అందరికి టోకాన్స్ ఇచ్చి పద్ధతి ప్రకారం బియ్యం పంపిణి చేయవలెను అని సూచించారు. అందరు తప్పకుండ స్టాక్ రిజిస్టర్ ను నిర్వహణ చేయాలని అలాగే రేషన్ దుకాణం వద్ద బోర్డు పెట్టాలని సూచించారు. లబ్దిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలుగ జేయవద్దు అని, స్టాక్ రిజిస్టర్ ను సక్రమముగా నిర్వహణ చేయాలని తాహాసిల్దార్ ఆదేశించారు. అలాగే లబ్దిదారులకు చెందవలసిన బియ్యాన్ని అడ్డదారి పట్టించినట్లయితే తగిన చర్యలు తీసుకుంటామని తాహాసిల్దార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నర్సింగ్ యాదవ్, రెవెన్యూ సిబ్బంది, రేషన్ దుకాణపు డీలర్లు పాల్గొన్నారు.



## ఇంటిగ్రేటెడ్ స్కూల్ తరలింపు పై కాంగ్రెస్ ఫైర్



- స్కూల్ తరలింపు ఆలోచన మానుకోవాలి

**జిన్నారం ఏప్రిల్ 09 సిరి న్యూస్**

జిన్నారం మున్సిపాలిటీ పరిధిలోని నల్తూరు గ్రామంలో మంజూరైన ఇంటిగ్రేటెడ్ స్కూల్ ని కక్షపూరితంగా కావాలని పటాన్చెరువు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పోచారం గ్రామానికి మంజూరు చేయాలని, కలెక్టర్ కు రాతపూర్వకంగా ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్న జిన్నారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులు గురువారం మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. జిన్నారం మున్సిపాలిటీ నల్తూరు గ్రామంలో మంజూరు చేసిన ఇంటిగ్రేటెడ్ స్కూల్ ని యధావిధిగా నల్తూరు లోనే ఏర్పాటుకు, అన్ని పార్టీలు సహకరించాలని వారు కోరారు. గతంలో మోడల్ స్కూల్ మండల కేంద్రంలో నిర్మించాలనుకున్నారు. కానీ స్కూల్ ని బొల్లారం కి తరలించడంలో కొంతమంది నాయకులు సహకారం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఇప్పటికైనా ఇంటిగ్రేడ్ స్కూల్ షిఫ్టు నిర్ణయం వెంటనే ఉపసంహరించాలి అని కాంగ్రెస్ శ్రేణులు కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, వడ్డే కృష్ణ, కౌన్సిలర్ పర్వతాలు యాదవ్, నరేందర్ గౌడ్, ఎర్రవల్లి ప్రవీణ్, నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీనివాస్ నగర్ పార్క్ ప్రారంభం




**రామచంద్రపురం, ఏప్రిల్ 9 (సిరి న్యూస్):**

రామచంద్రపురం 268వ డివిజన్ శ్రీనివాస్ నగర్ కాలనీలో మూసివేసి ఉన్న పార్క్‌ను అధికారులు గురువారం తిరిగి ప్రారంభించారు. ఇటీవల మాజీ కార్పొరేటర్ అంజయ్య కురుమ పార్క్‌ను వెంటనే తెరవాలని అధికారులను కోరిన విషయం తెలిసిందే. ఆయన విజ్ఞప్తికి స్పందించిన అధికారులు పార్క్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చారు.పార్క్ ప్రారంభంతో కాలనీ ప్రజలు ఆనందం వ్యక్తం చేశారు. చిన్నారులు, మహిళలు, వృద్ధులు పార్క్‌లోకి వచ్చి సంతోషం వ్యక్తం చేస్తూ అధికారులు, మాజీ కార్పొరేటర్ అంజయ్యకు ధన్యవాదాలు తెలిపారు.స్థానికులు మాట్లాడుతూ పార్క్ మూసివేయడంతో ఇంతకాలం ఇబ్బందులు ఎదుర్కొన్నామని, ఇప్పుడు పార్క్ అందుబాటులోకి రావడం సంతోషంగా ఉందన్నారు. పార్క్ నిర్వహణను క్రమం తప్పకుండా కొనసాగించాలని అధికారులను కోరారు.ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారులు త్వరితగతిన పరిష్కరించడం అభినందనీయమని, భవిష్యత్తులో కూడా ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని కోరారు

## వరిగుంతంలో ఎల్లమ్మ పోచమ్మ లకు బోనాల పండుగ





**కొల్చారం ఏప్రిల్ 09 (సిరి న్యూస్)**

కొల్చారం మండల పరిధిలోని తృతీయ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నాడు ఎల్లమ్మ పోచమ్మ లకు ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు ఉదయం నుండే అన్ని దేవాలయాలను అందంగా ముస్తాబు చేశారు ఎల్లమ్మ పోచమ్మ దేవాలయాలను అందంగా ముస్తాబు చేసి విద్యుత్ దీపాలంకరణ చేశారు సాయంకాలం వేళ గ్రామ ప్రజలందరూ కలిసి అమ్మవార్లకు బోనాలు సమర్పించారు ఈ సందర్భంగా మహిళా భక్తులతో పాటు ప్రజలు అఖిలపక్షాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి దామోదరను కలిసిన మున్సిపల్ వైస్ చైర్మన్ చిట్టిబాబు



**జోగిపేట, ఏప్రిల్ 09, (సిరిన్యూస్ ):**

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సి.దామోదర రాజనర్సింహను జోగిపేట మున్సిపల్ వైస్ చైర్మన్ ఆకుల చిట్టిబాబు ముదిరాజ్ గురువారం హైద్రాబాద్‌లోని మినిష్టర్స్ క్వార్టర్స్‌లో కలిసారు. శుక్రవారం జోగిపేటలోని సిద్దివినాయక టౌన్‌షిప్‌లో జరిగే శ్రీ గురుపాదుకా పూజా మహోత్సవ కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వానపత్రంతో పాటు టీటీడీ ప్రసాదాన్ని మంత్రికి అందజేసారు. ఈ కార్యక్రమంలో మాధవానందస్వామి పాదుకా పూజా కార్యక్రమం ఉంటుందని తెలిపారు. మంత్రి దామోదర్‌ను శాలువాతో సత్కరించారు. ఏప్రిల్ నెలాఖరులో సిద్దివినాయక వెంచర్‌లో జరిగే కార్యక్రమానికి హాజరుకావాలని చిట్టిబాబు మంత్రిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

# భర్త చేసిన తప్పుకు భార్య బలిపశువువయ్యింది

- చేయని నేరానికి చెట్టుకు కట్టివేయబడింది..
- డబ్బులు తీసుకున్న భర్తను అప్పజెప్పాలని భార్యను గ్రామంలో బంధించిన గ్రామస్థులు

**కంగ్టి,ఏప్రిల్ 9 సిరి న్యూస్ ;**



గ్రామంలో ఫైనాన్స్ పెట్టుబడులు పెట్టించి తిరిగి ఇవ్వకుండా ఒక వ్యక్తి పరారయ్యాడు.ఇది తెల్సిన గ్రామస్తులు భర్త ఆచూకీ తెలపాలని భార్యను చెట్టుకు కట్టి హింసించారు.ఓ అంగన్వాడీ టీచర్ అందులో వృద్ధురాలు అన్న కనీస విచక్షణ లేకుండా ప్రవర్తిస్తూ ఆమెను హింసించిన సంఘటన సంగారెడ్డి జిల్లా కంగ్టి మండలం రాపోలు గ్రామంలో వెలుగులోకి వచ్చింది.రాపోలు గ్రామానికి చెందిన వసంత కుమారి ఆ గ్రామంలో అంగన్వాడీ టీచర్.ఆమె భర్త ఎచ్బిఎం ఫైనాన్ ఏజెంట్ గా పనిచేస్తున్నాడు. ఆ ఫైనాన్సులో గ్రామానికి చెందిన చాల మందికి మంచి లాభం వస్తుందని పెట్టుబడులు పెట్టించాడు.కానీ కొన్నాళ్లకే సదరు వ్యక్తి అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యులను అడిగారు.తన భర్త ఆచూకీ తెలియదని చెప్పినా,డబ్బులు పెట్టి మోసపోయిన బాధితులు కొందరు భర్తపై కోపం భార్యపై చూపించారు.గ్రామంలో ఆమెను చెట్టుకు కట్టేసి అవమానించారు.నానా దుర్భాషలాడారు తన భర్త జాడ తనకు తెలియదన్న వినలేదు.గంట పాటు చెట్టు కు కట్టేసి ఆపై కొందరి జోక్యం మూలంగా వదిలేసారు.ఈ మేరకు పోలీసులను బాధితురాలు ఆశ్రయించగా 5 గురిపై కేసు నమోదు చేశారు

# జీవన్ రెడ్డి పార్టీని వీడడం బాధాకరం !

**ఢిల్లీ నాయ క త్వం రంగంలోకి దిగితే బాగుండేది..**
**టీపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**



**సంగారెడ్డి, ఏప్రిల్ 9(సిరి న్యూస్):**

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత జీవన్‌రెడ్డి పార్టీని వీడడం చాలా బాధాకరమని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ జీవన్‌రెడ్డి సోనియా గాంధీ, రాహుల్ గాంధీ కుటుంబానికి, కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా ఉన్నారని గుర్తు చేశారు. జీవన్ రెడ్డి విషయంలో అంతర్గతంగా ఏం జరుగుతుందో ఏఐసీసి స్థాయిలో చెక్ చేసుకోవాల్సి ఉండాల్సిందన్నారు. నేరుగా డిల్లీ నాయకత్వమే రంగంలోకి దిగి సమస్యను పరిష్కరించి ఉంటే బాగుండేదని, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని స్పష్టం చేశారు. ఎమ్మెల్యేలు, నాయకులు పార్టీలు మారడం ప్రస్తుత రాజకీయాల్లో సహజమన్నారు. జీవన్ రెడ్డి పార్టీ మారడానికి గల కారణాలను బహిరంగంగా మీడియాతో మాట్లాడలేమని, అంతర్గతంగా పార్టీలో చర్చిస్తామన్నారు.

# చెరువు కాలుష్య సమస్యకు ఎమ్మెల్యే పరిష్కారం

**ప్రత్యామ్నాయ కాలువ తవ్వించి కలుషిత నీటి మళ్లింపు**




**వరంగల్ 09 సిరి న్యూస్ :** వరంగల్ జిల్లా వర్ధన్నపేట నియోజకవర్గంలోని కాజీపేట మండల పరిధిలోని మడికొండ రాంపూర్ డంపింగ్ యార్డు సమీపంలో ఉన్న వాగు ద్వారా కలుషిత నీరు మడికొండ చెరువులోకి చేరుతున్న సమస్యను మడికొండ ముదిరాజ్ సంఘ సభ్యులు ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయంపై వెంటనే స్పందించిన వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కెఆర్ నాగరాజు గురువారం సంబంధిత అధికారులతో కలిసి సమస్యను పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డు సిబ్బంది, టాటా హిటాక్సీ యంత్రం సహాయంతో చెరువులోకి ప్రవహిస్తున్న కలుషిత నీటిని నిలువరించేందుకు ప్రత్యామ్నాయ కాలువ తవ్వించి, ఆ నీటిని ఇతర దిశకు మళ్లించే చర్యలు చేపట్టించారు. ఈ చర్యతో మడికొండ చెరువు నీటి కాలుష్యం నివారించబడుతుందని స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. సమస్యపై వెంటనే స్పందించి పరిష్కారం చూపిన ఎమ్మెల్యే నాగరాజుకు మడికొండ ముదిరాజ్ సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దువ్వా శ్రీకాంత్, దువ్వ నవీన్, చిన్న కుమార్, విజయ్, కొమురయ్య, కుక్కల దేవరాజ్, శ్రీకాంత్, నర్ర దుర్గయ్యతో పాటు ముదిరాజ్ సంఘ పెద్దలు, స్థానికులు పాల్గొన్నారు.

# టీఈఈఏ అధ్యక్షునిగా శివాజీ ఎన్నిక

- అన్ని పదవులకు పోటా పోటీగా నామినేషన్లు
- శివాజీ కి వ్యతిరేకంగా నమోదు కానీ నామినేషన్లు

**హైదరాబాద్,ఏప్రిల్ 9,సిరి న్యూస్ :**



తెలంగాణ ఉద్యమంలో కీలక భూమిక పోషించిన ఎన్. శివాజీ నాల్గవ సారి తెలంగాణ ఎలక్ట్రికల్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఆవిర్భవించిన తెలంగాణ ఇంజనీర్స్ అసోసియేషన్ (టీఈఈఏ) తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కీలక భూమిక పోషించింది. 2020 సంవత్సరం నుంచి 2014 సంవత్సరం వరకు రాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున జరిగిన రాష్ట్ర సాధన ఉద్యమంలో శివాజీ ఆధ్వర్యంలో విద్యుత్ ఉద్యోగులు కీలక భూమిక పోషించారు. రాష్ట్రం సాధించుకున్న తర్వాత ప్రతి తెలంగాణ ఉద్యోగికి అండగా ఉంటు విద్యుత్ సంస్థలో అందరిలో ఒకడుగా ఉంటు రాష్ట్రంలోనే తనకంటు ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నారు. రాష్ట్ర విభజన తర్వాత సీమాంధ్ర మూలాలు ఉన్న ఉద్యోగులను ఇక్కడి నుంచి పంపించడానికి విశ్వప్రయత్నం చేశారు. సుప్రీంకోర్టు వరకు వెళ్లారు. తెలంగాణ ఉద్యోగులకు పదోన్నతుల విషయంలో, కొత్త ఉద్యోగ నియామకాలలో టీఈఈఏ తరపున శివాజీ ముఖ్యపాత్ర పోషించారు. ఉద్యోగులకు ఏ సమస్య వచ్చినా విద్యుత్ సంస్థల యాజమాన్యాలతో పోరాడి సమస్యలను సాధించుకున్నారు. టీఈఈఏ అంటే శివాజీ, శివాజీ అంటే టీఈఈఏ అనే స్థాయికి ఎదగడమే కాకుండా అసోసియేషన్‌లో ఉన్న ఐదు వేలకు పైగా ఉన్న సభ్యులతో మమేకమయ్యారు. అందరి వాడుగా ఎదిగిన శివాజీకి వ్యతిరేకంగా టీఈఈఏలో పోటీ చేయడానికి ఎవరు ముందుకు రాలేదు. నాల్గవ సారి కూడా (12 సంవత్సరాలుగా) శివాజీని ఏకగ్రీవంగా ఎన్నుకుని తమ ప్రేమాభిమానాలను చాటుకున్నారు.

**కరంటు- ఇంజనీర్ల ఆత్మీయ, అభిమాన నాయకుడుగా**

యన్. శివాజీ నిలిచారు. ఐదువేలకు పైగా సభ్యులతో ఉన్న టీఈఈఏలో ప్రతి సభ్యునికి ఏలాంటి సమస్య వచ్చినా నేనున్నాను అనే విధంగా అందరిలో ఒకడిగా ఉంటు సమస్యల పరిష్కారంలో ముందుంటారు. నాయకత్వ లక్షణాలతో ముందు చూపుతో ఉద్యోగులకు ఏలాంటి సమస్య రాకుండా జాగ్రత్తలు తీసుకుంటు అందరి మన్ననలు పొందారు.టీఈఈఏ అధ్యక్షులుగా నాల్గవసారి ఏకగ్రీవంగా ఎన్నికైన ఎన్. శివాజీ మాట్లాడుతు తన పట్ల నమ్మకంతో మరోసారి ఏకగ్రీవంగా ఎన్ను కున్నందుకు ఆయన సభ్యులందరికి దన్యవాదాలు తెలిపారు. టీఈఈఏ తెలంగాణ ఉద్యమం నుంచి పుట్టిందని, తెలంగాణ అస్థిత్వాన్ని కాపాడడమే లక్ష్యంగా ముందుకు వెళ్లడమే టీఈఈఏ లక్ష్యం అన్నారు. టీఈఈఏ ప్రతి సభ్యుడు తెలంగాణ ఆత్మలో ఒక భాగంగా ముందుకు సాగాలని కోరారు. టీఈఈఏలో . తప్పని పరిస్థితిలో పోటీ చేసినా ఫ్రేండ్లీ గా ఉండాలని, గెలుపు ఓటములు సహజమని, దానితో నిరాశ చెంది మన సంఘాన్ని మనమే నీరుగార్చే ప్రయత్నం చేసే ప్రయత్నం ఎవరు చేయకూడదన్నారు. భవిష్యత్‌లో అందరికి అవకాశాలు వస్తాయని, అందరం ఒకటిగా పని చేసుకుంటు తెలంగాణ అభివృద్ధి కోసం నిరంతరం పని చేయాల్సిన అవసరం ఉందని శివాజీ సభ్యులకు పిలుపు నిచ్చారు.

# మెదక్ ఆర్టీసీ డిపోను మోడ్రన్ గా తీర్చిదిద్దుతా

- రామాయంపేట లో ఎక్స్‌ప్రెస్ బస్టాండ్ గా అభివృద్ధి..
- మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు..

**మెదక్ ఏప్రిల్,09(సిరిన్యూస్)**




మెదక్ ఆర్టీసీ డిపో ను మోడ్రన్ గా తీర్చి దిద్దుతామని, రామాయంపేట ను ఎక్స్ప్రెస్ డిపోగా అభివృద్ధి చేస్తామని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ప్రయాణికులకు శుభవార్త చెప్పారు.గురువారం రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ తో మాట్లాడారు.చర్చల అనంతరం ఆర్టీసీ అధికారులకు ఎమ్మెల్యే పలు సూచనలు చేశారు. మెదక్ డిపోను మోడర్న్‌గా మార్చడంతో పాటు రామాయంపేట డిపోను ఎక్స్‌ప్రెస్ డిపోగా అభివృద్ధి చేయాలని నిర్ణయించామన్నారు. ఆర్టీసీ అధికారులతో కలిసి ఎమ్మెల్యే డిపోను పరిశీలించి ప్లాట్‌ఫారమ్‌ల విస్తరణ, బస్సులు మరియు డ్రైవర్ల కొరత నివారణ, పాత బస్సుల స్థానంలో కొత్త ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. అదేవిధంగా రామాయంపేట బస్ స్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యంగా ఉండేలా మరుగుదొడ్ల పునర్నిర్మాణ పనులు కూడా చేపట్టాలన్నారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్,పట్టణ పార్టీ అధ్యక్షులు గంగాధర్, కౌన్సిలర్ లు మన్సూర్, శివరామకృష్ణ, నాయకులు ఆవారి చంద్రశేఖర్, రాగి అశోక్, బోజ్జ పవన్, రాములు, మహ్మద్ సమీయుద్దీన్, బాలరాజ్ యాదవ్, ఉమర్, మెసన్ బిన్ అబ్దుల్లా, అబ్దుల్ సత్తార్, శంకర్ గౌడ్, ఎం బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే





- బోయిని విక్రమ్, గంట రాజు, భువనగిరి శంకర్ కుటుంబాల పరామర్శ..
- కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపిన మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు...

**మెదక్ ఏప్రిల్ 09(సిరిన్యూస్)**

మెదక్ పట్టణానికి చెందిన పలువురు ఇటీవల మరణించడం వారి కుటుంబాలను గురువారం మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకుడు బోయిని విక్రమ్,మాజీ ఏఎంసీ చైర్మన్ గంట రాజు, అలాగే టీ న్యూస్ విలేకరి బోనగిరి చంద్రశేఖర్ తండ్రి బోనగిరి శంకర్ కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే సందర్శించారు.ఈ సందర్భంగా బాధిత కుటుంబాలకు మనోధైర్యం నింపుతూ, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఎమ్మెల్యే వెంట మున్సిపల్ వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, పట్టణ పార్టీ అధ్యక్షుడు ఎం గంగాధర్, మున్సిపల్ కౌన్సిలర్లు మన్సూర్, శివరామకృష్ణ, మాజీ కౌన్సిలర్ సమీయొద్దీన్, నాయకులు ఆవారి చంద్రశేఖర్, బాలకృష్ణ, బాలరాజు యాదవ్, సిద్ధిరాములు, ఎండి మైసన్ తదితరులు ఉన్నారు.

# ప్రజా అభీష్టం గౌరవించాలి ఎమ్మెల్యే కు విజ్ఞప్తి

- నల్తూర్ లోనే ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటుకు శ్రీకారం

**జిన్నారం ఏప్రిల్ 09 సిరి న్యూస్**



జిన్నారం మున్సిపల్ పరిధిలోని నల్తూరు గ్రామంలో ఇంటిగ్రేటెడ్ స్కూల్ పై నిన్న కలెక్టర్ తో మాట్లాడిన విషయంపై గురువారం జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ ముదిరాజ్ ఆధ్వర్యంలో కౌన్సిలర్లు అంతా కలిసి పటాన్చెరు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి మెమోరండం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ మాట్లాడుతూ.. ఇంటిగ్రేటెడ్ స్కూల్ నల్తూర్ గ్రామంలోనే ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కలిసామని తెలిపారు.నల్తూర్ గ్రామం సర్వే నెంబరు 158 లో మంజూరు అయిన ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ కాంప్లెక్స్ భవనాన్ని నల్తూర్ లోనే కొనసాగించాలని వారు విన్నవించారు. స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి సానుకూలంగా స్పందించారని, జిన్నారం మున్సిపల్ చైర్మన్ జనార్ధన్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# రొట్టె, పాలతో అదిరిపోయే కుల్ఫీ.. ఇంట్లోనే చేసుకోవచ్చు..

వేసవిలో మనకు కామన్‌గా తినాలనిపించే చల్లని ఆహారపదార్థాలలో కుల్ఫీ ఒకటి. పెద్దలు కూడా ఆస్వాదించగల ఫుడ్ ఐటెం. ఇంట్లోనే తయారుచేసే మెత్తటి కుల్ఫీలలో ఈ కుల్ఫీ చాలా ప్రత్యేకం. అందుకే, ఈరోజు మీ కోసం చాలా ఆహ్లాదకరమైన కుల్ఫీ రెసిపీని తీసుకొచ్చాం. ఇందులో మీకు పాలు, బ్రెడ్‌తో ఎలా తయారుచేయాలో చూసేయండి. 15 నిమిషాలలో రెడీ అయ్యే ఈ కుల్ఫీతో ఫ్యామిలీ అంతా ఎంజాయ్ చేసేయండి.






### కావలసిన పదార్థాలు


- సుమారు రొట్టె ముక్కలు - 3
- పాలు - 1 లీటరు
- కొన్ని కేసరి పలుకులు
- చక్కెర - అర కప్పు
- అంజీర్లు - 4 (చిన్న ముక్కలుగా)
- తరిగిన బాదం - (2 చెంచాలు)
- తరిగిన పిస్తా - (2 చెంచాలు)
- యాలకుల పొడి - (1/4 చెంచా)

### తయారు చేసుకునే విధానం..

బ్రెడ్, పాలతో రుచికరమైన మెత్తని కుల్ఫీ (ఐస్ క్రీం) తయారు చేయడానికి బ్రెడ్ తీసుకొని వాటి మందపాటి అంచులను కట్ చేసుకోండి. ఇప్పుడు వీటిని మిక్సీలో వేసి మెత్తగా పొడి చేసుకోండి. ఆ తర్వాత గ్యాస్ మీద కడాయి ఉంచి, అందులో పాలు మరిగేలా ఉంచండి. పాలు మరిగేటప్పుడు, అందులో చక్కెర, కొన్ని కేసరి పలుకులు, తరిగిన అంజీర్లను కలపండి. ఇప్పుడు పాలను కలుపుతూ సుమారు 5 నిమిషాల పాటు ఉడికించండి. చక్కెర పాలలో బాగా కలిసే వరకు ఆగి ఆ తర్వాత పాలలో రొట్టె పొడిని కలపండి. పాలను కలుపుతూ ఉడికించండి. పాలు క్రీంలాగా మారిన తర్వాత, అందులో తరిగిన బాదం, పిస్తా రుచి కోసం చిటికెడు యాలకుల పొడిని కలపండి. అన్ని పదార్థాలను కలుపుతూ కొంతసేపు ఉడికించండి. పాలు చాలా చిక్కగా మారే వరకు. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని కుల్ఫీ పాత్రల్లో పోసి, సుమారు 8 గంటల పాటు ఫ్రిజ్‌లో ఉంచండి. అయితే, మీ రుచికరమైన మెత్తని పాలు, రొట్టె కుల్ఫీ రెడీ అయిపోతుంది.

# ఏఐ ఆధారిత సెక్స్ రోబోట్!





ఏఐ.. మానవ జీవితంలో దాదాపు ప్రతి అంశాన్ని ప్రభావితం చేస్తున్న విషయం. ఉద్యోగాలు, ఆలోచించే శక్తి, ఒక అంశంపై సోధించే జిజ్ఞాశ ఇలా అన్నింటిపైనా ప్రభావం చూపుతాయి. తాజాగా ఇప్పుడు నాలుగు గోడల మధ్య ఆలుమగలు, అమ్మాయిఅబ్బాయి మధ్య జరిగే శృంగారంపై కూడా ఏఐ ప్రభావం చూపనుంది. మనిషికి మనిషికీ మధ్య ఉన్న బంధాన్ని నాశనం చేయడంలో ఏఐ కీలక భూమిక పోషించబోతోందని హెచ్చరికలు వినిపిస్తున్నాయి. ఈ సమయంలో శృంగార భాగస్వామిని కూడా ఏఐ సహకారంతో సాధ్యం చేయొచ్చని అంటున్నారంట గూగుల్ మాజీ ఎగ్జిక్యూటివ్. అవును... సాన్నిహిత్యంతో ముడిపడి ఉన్న మానసిక, భావోద్వేగ ఉద్దీపనలను కూడా కృత్రిమంగా పునర్నిర్మించవచ్చని ఆయన చెబుతున్నారు. ఇది ఎప్పుడో ప్రారంభమైనప్పటికీ ప్రస్తుతం ఈ రోబోలపై ప్రజల్లో ఆసక్తి అధికం అవుతోంది. మనుషుల మధ్య సన్నగిల్లుతున్న బంధాలే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తోంది. గూగుల్ రహస్య పరిశోధనఅభివృద్ధి విభాగం మాజీ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మొహమ్మద్ మో గావదత్... ఏఐ "ప్రేమ సంబంధాల పునఃరూపకల్పన"ను ప్రారంభిస్తుందని.. దీంతో ప్రజలు నిజ జీవితంలో లైంగిక కార్యక్రమాలలో కృత్రిమంగా సృష్టించబడిన వాటి మధ్య తేడాను గుర్తించలేరని చెబుతున్నారని తెలుస్తుంది. ఇదే సమయంలో మానవులు త్వరలో వర్చువల్ రియాలిటీ, యాపిల్ విజన్ ప్రో లేదా క్వెస్ట్ 3 వంటి ఆగ్మెంటెడ్ రియాలిటీ హెడ్ సెట్ లను ఉపయోగించి సెక్స్‌ను అనుకరించగలరని గావదత్ చెబుతున్నారంట. అదేవిధంగా... కొంతకాలం తర్వాత మానవ నాడీ వ్యవస్థకు నేరుగా కనెక్ట్ అయ్యే న్యూరాలింక్, ఇతర మార్గాల గురించి ఆలోచిస్తే... ఒక మనిషికి మరో మనిషి ఎందుకు అవసరం? అనే ప్రశ్నలు ఉత్పన్నమయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారని తెలుస్తుంది. ఈ రోబోలు ఒక్కసారి మార్కెట్లోకి వచ్చాయంటే మానవ సంబంధాలు పేకమేడల్లా కూలిపోయే ప్రమాదం ఉందని, దాంపత్య జీవితం అనే అంశానికి ఫుల్‌స్టాప్ పడే ప్రమాదం ఉందని కొందరు నిపుణులు అంటున్నారు. అంతేకాకుండా ఈ రోబోల కారణంగా మరెన్నో ప్రమాదాలు కూడా ఉన్నాయని, ఏదైనా సంస్థ కావాలంటే మీ ప్రైవేట్ వీడియోలను మీకే తెలియకుండా రికార్డ్ చేసి.. వాటితో మిమ్మల్ని బ్లాక్ మెయిల్ చేసే అవకాశాలు కూడా లేకపోలేదని అంటున్నారు.



# పొడవాటి జుట్టు కావాలంటే ఇవి చేయాల్సిందే..!

పొడవాటి జుట్టు కావాలన్నది ప్రతి అమ్మాయికి ఉండే కల. కొందరికి చిన్నప్పటి నుంచే వత్తైన పొడవాటి జుట్టు ఉంటే మరికొందరు దీని కోసం చేయని ప్రయత్నాలు ఉండవు. అనేక రకాల క్రీమ్‌లు, హెయిర్ ఆయిల్స్, బ్యూటీ ప్రొడక్ట్స్ వంటివి వాడుతుంటారు. కానీ ఫలితం ఉండదు. పైగా కొన్నికొన్ని సందర్భాల్లో జుట్టు పెరగడానికి పైగా.. రాలడం మొదలవుతుంది. అంతేకాకుండా జుట్టు ఉన్నదానికన్నా పల్చబడిపోయి.. చిట్లి పోయి.. అత్యంత దారుణంగా తయారవుతుంది. అయితే జుట్టు బాగా పెరగాలంటే రకరకాల ఖరీదైన బ్యూటీ ప్రొడక్ట్స్ వాడాల్సిన అవసరం లేదంటున్నారు వైద్యులు.

అసలు జుట్టు రాలడానికి, అనారోగ్యంగా తయారవడానికి ప్రధాన కారణం దుమ్ము, ధూళి, పోషకాలు లేని ఆహారమేనని చెప్తున్నారు నిపుణులు. వీటిని సరిచేసుకోవడం ద్వారా ఆరోగ్యవంతమైన జుట్టు పెరుగుతుందనేది వైద్యులు చెప్తున్నమాట. అంతేకాకుండా కొన్ని చిట్కాలు పాటించడం ద్వారా పొడవైన జుట్టును పొందొచ్చని నిపుణులు అంటున్నారు. సాధారణంగానే బ్యూటీ ప్రొడక్ట్‌స్‌లో ఉండే రకరకాల కెమికల్స్ మంచి చేయాల్సింది పోగా చెడు చేసే అవకాశాలు ఉన్నాయని, ఏదైన కెమికల్ వికటిస్తే అనేక సమస్యలకు కారణమవుతుందని అంటున్నారు. కొన్ని హోం మేడ్ సీరమ్‌స్‌ను వాడటం ద్వారా వత్తైన, పొడవాటి జుట్టును పొందొచ్చట. మరి ఆ సీరమ్స్ ఏంటో ఒకసారి చూద్దామా..

### కావాల్సిన పదార్థాలు :

కరివేపాకు, బ్లాక్ సీడ్స్, మెంతులు, కలబంద, ఉల్లిపాయ, ఆవనూనె

### తయారు చేసుకునే విధానం..

ఒక పాత్ర తీసుకుని అందులో కరివేపాకు, బ్లాక్ సీడ్, కలబంద, మెంతులు, ఉల్లిపాయ ముక్కలు, ఒక కప్పు ఆవ నూనె వేసి స్టవ్ మీద పెట్టాలి. మంట తక్కువలో పెట్టి అరగంట పాటు మరిగించాలి. ఆ తర్వాత స్టవ్ అఫ్ చేసి నూనెను ఆరనివ్వాలి. ఆ నూనెను గాజు సీసాలోకి వడకట్టుకుని నిల్వ చేసుకోవాలి



ఈ హెయిర్ ఆయిల్‌ను జుట్టు కుదుళ్లకు పట్టేలా మర్దనా చేస్తూ పట్టించాలి. ఒక గంట తర్వాత సాధారణ షాంపూతో తలస్నానం చెసేయాలి. ఇలా ప్రతిరోజు చేస్తే మంచి ఫలితం ఉంటుంది. జుట్టు పొడవుగా పెరిగేందుకు ఈ ఆయిల్ అద్భుతంగా పనిచేస్తుంది. ఇందులో ఉపయోగించే పదార్థాలన్ని జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయి. వీటిలో ఉండే పోషకాలు జుట్టుతో పాటు ఆరోగ్యానికి కూడా చాలా మంచిది.

### కావాల్సిన పదార్థాలు:

కొబ్బరి నూనె, ఉసిరికాయలు, కరివేపాకు, మెంతులు, అవిసెగింజలు, బ్లాక్ సీడ్స్, మందార పువ్వులు.

### తయారు చేసుకునే విధానం:

కొబ్బరి నూనెను ఒక పాత్రలో వేసుకుని స్టవ్ పెట్టి వేడి చేయాలి. అందులో ఫ్లాక్ సీడ్స్, ఉసిరి ముక్కలు, మెంతులు, కరివేపాకు, అవిసెగింజలు, బ్లాక్ సీడ్స్, మందార పువ్వులు అన్నీ వేసి బాగా మరిగించాలి. ఒక 20 నిమిషాల తర్వాత స్టవ్ ఆఫ్ చేసి ఆ నూనెను చల్లార్చాలి. ఈ నూనె నెల రోజుల పాటు నిల్వ ఉంటుంది.

ఈ నూనెను ప్రతిరోజు జుట్టు చివర్ల వరకు అప్లై చేయండి. దీన్ని గంట ముందు జుట్టుకు పెట్టుకుని ఆ తర్వాత తలస్నానం చేయొచ్చు. కొద్ది రోజుల్లోనే ఈ నూనె మంచి ఫలితాన్నిస్తుంది. ఈ నూనెను తరచుగా వాడితే జుట్టు పొడవుగా, వత్తుగా పెరుగుతుంది. చుండ్రు సమస్యలు కూడా తొలగిపోతాయి.





# గూఢచారి 2 పై సాలిడ్ అప్డేట్ ఇచ్చిన శేష్!

వరుస సినిమాలతో, విభిన్నమైన కథలతో సక్సెస్ అందుకుంటున్న యంగ్ హీరో అడివి శేష్. టాలీవుడ్‌లో తనకంటూ ఒక ప్రత్యేకమైన గుర్తింపు సాధించుకున్న ఈ సక్సెస్‌ఫుల్ హీరో, ఏ సినిమా చేస్తున్న అది హిట్ సాధిస్తుందనే నమ్మకం సగటు సినిమా ప్రేమికుల్లో ఏర్పడిందంటే అది అతిశయోక్తి కాదు. ప్రస్తుతం ఈ యంగ్ హీరో కొత్త సినిమా డెకాయిట్ విడుదలకు సిద్ధం అవుతుంది. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ సినిమాపై ప్రేక్షకులలో ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి.

ఈ యంగ్ అండ్ టాలెంటెడ్ హీరో నటిస్తున్న తదుపరి చిత్రం గూఢచారి 2. 'గూఢచారి'కి సీక్వెల్‌గా వస్తున్న ఈ చిత్రం భారీ యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతుంది. ఈ సినిమా కోసం సినీ ప్రియులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. ఈ మూవీ విడుదలపై వస్తున్న వార్తలకు తాజాగా అడివి శేష్ ఫుల్ స్టాప్ పెట్టారు. భారీ బడ్జెట్‌తో, అంతర్జాతీయ ప్రమాణాలతో తెరకెక్కుతున్న 'G2' మరో మూడు నెలల్లోనే థియేటర్లలోకి వస్తుందని సోషల్ మీడియా వేదికగా వస్తున్న వార్తలకు ఈ యంగ్ హీరో తాజాగా చెక్ పెట్టారు. ఈ సినిమా షూటింగ్ ఇంకా కంప్లీట్ కాలేదని, భారీ స్థాయిలో పోస్ట్ ప్రొడక్షన్ పనులు బ్యాలెన్స్ ఉండటంతో అవన్నీ పూర్తి చేసుకొని ఈ చిత్రాన్ని ఈ ఏడాది చివరలో చేస్తామని శేష్ స్పష్టం చేశారు. క్యాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడకూడదనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు.

తన బాలీవుడ్ ఎంట్రీ గురించి శేష్ ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. పాన్ ఇండియా లెవల్లో 'మేజర్' సినిమా సూపర్ హిట్ కావడంతో హిందీలో ఆయనకు ఏకంగా ఆరు భారీ ఆఫర్లు వచ్చాయట. అయితే వాటిని శేష్ సున్నితంగా తిరస్కరించడం ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. తనకు వచ్చిన ఆరు ఆఫర్లలో నాలుగు వార్ మూవీస్ కాగా, రెండు బయోపిక్‌లు ఉన్నాయని ఆయన వెల్లడించారు. ఒకే రకమైన పాత్రలకు లేదా జోనర్లకు పరిమితం కాకూడదనే ఉద్దేశంతోనే వాటిని వద్దనుకున్నట్లు తెలిపారు. మేజర్ సందీప్ ఉన్నికృష్ణన్ జీవిత కథతో తీసిన 'మేజర్' తన డ్రీమ్ ప్రాజెక్ట్ అని, ఆ సినిమా తనకు సంతృప్తిని ఇచ్చిందని పేర్కొన్నారు. అది పూర్తయిన తర్వాత మళ్లీ అటువంటి జోనర్ల జోలికి వెళ్లనని స్పష్టం చేశారు. భవిష్యత్తులో యుద్ధ సినిమాలు లేదా బయోపిక్‌లు చేసే ఉద్దేశం లేదని, విభిన్నమైన కథలతో ప్రేక్షకులను అలరించడమే తన లక్ష్యమని తేల్చి చెప్పారు. ప్రస్తుతం తన ఫోకస్ అంతా 'G2' పైనే ఉందని, ఈ సినిమా ప్రేక్షకులకు సరికొత్త యాక్షన్ అనుభూతిని ఇస్తుందని ధీమా వ్యక్తం చేశారు.




# ఆమె మేకప్ ఆర్టిస్ట్ మాత్రమే కాదు.. ప్రీతీశీల్‌పై 'ధురంధర్' డైరెక్టర్ ప్రశంసలు

'ధురంధర్' సినిమాలకు వర్క్ చేసిన మేకప్, ప్రోస్థటిక్ ఆర్టిస్ట్ ప్రీతీశీల్ సింగ్‌పై ఆదిత్యధర్ ప్రశంసలు కురిపించారు. ప్రీతితో కలిసి దిగిన ఫొటోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ.. ఆమె ప్రతిభ గురించి అభిమానులకు చెప్పారు. 'ధురంధర్' కోసం ఆమెను సంప్రదించిన క్షణాలను గుర్తుచేసుకున్నారు

''ధురంధర్' కోసం ప్రీతి పేరును కొందరు నాకు సూచించినప్పుడు నేను సందేహించా. అహంకారి అని, పారితోషికం ఎక్కువ అడుగుతుందని, భారీ ప్రాజెక్టులు మాత్రమే చేస్తుందని.. ఇలా ఆమె గురించి అంతకుముందు నేను విన్న మాటలే ఇందుకు కారణం. తర్వాత మనసు మార్చుకుని ఆమెను కలిశా. ఒక్క మీటింగ్‌లోనే అవన్నీ అవాస్తవాలని అర్థమైంది. ఇతరుల అభిప్రాయలపై ఆధారపడి ఎవరినీ అపార్థం చేసుకోకూడదని అనుకున్నా. ప్రీతి అసాధారణ ప్రతిభ కలిగిన ఆర్టిస్ట్ మాత్రమే కాదు.. మంచి మనిషి కూడా. అందరితోనూ ఎంతో ఆప్యాయంగా ఉంటుంది. సినిమాలోని ప్రతి పాత్ర గురించి, జీవితం గురించి సుదీర్ఘ చర్చలు సాగించేవాళ్లం. ఆ జ్ఞాపకాలు జీవితాంతం మర్చిపోలేనివి''

''ప్రీతి, ఆమె టీమ్ చాలా కష్టపడింది. మేం నిద్ర లేచే సమయానికే వాళ్లు సెట్‌స్‌లో ఉండేవారు. అందరూ వెళ్లిన తర్వాతే వాళ్లు సెట్స్ నుంచి వెళ్లేవారు. రోజుకు రెండు/మూడు గంటలపాటు నిద్రపోయేవారు. విజన్‌కు తగ్గట్టు అంకితభావంతో పని చేశారు. చిన్నా పెద్దా తేడా లేకుండా ప్రతి పాత్రకూ సహజత్వాన్ని తీసుకొచ్చారు. ఇలా చేయడం అరుదు. ప్రీతి నా కుటుంబ సభ్యురాలు. నా సోదరి'' అని ఆదిత్య పేర్కొన్నారు. అల్లు అర్జున్ బ్లాక్‌బస్టర్ మూవీ 'పుష్ప' సినిమాకూ ప్రీతి వర్క్ చేశారు.




# ఆ తేదీన విడుదల కానున్న 'స్వయంభు'

టాలీవుడ్ యువ నటుడు నిఖిల్ సిద్ధార్థ్ ప్రస్తుతం 'స్వయంభు' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. ఈ చిత్రంలో సంయుక్తా మీనన్, నభా నటేష్ హీరోయిన్లుగా కనిపించనుండగా, భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాత ఠాగూర్ మధు భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. భారీ గ్రాఫిక్స్‌తో రూపొందుతున్న ఈ చిత్రానికి సంబంధించి గతంలో పలు విడుదల తేదీలు ప్రచారంలోకి వచ్చినప్పటికీ, వీఎఫ్ఎక్స్ పనుల ఆలస్యంతో సినిమా విడుదల పదేపదే వాయిదా పడుతూ వచ్చింది. తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం, ఇప్పటివరకు ఈ చిత్రానికి సంబంధించిన సగం సీజీ పనులు సంతృప్తికరంగా పూర్తయ్యాయని, ప్రస్తుతం రెండో సగానికి సంబంధించిన సీజీ పనులు వేగంగా కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. అవి కూడా మరికొన్ని రోజుల్లో పూర్తయ్యే అవకాశాలు ఉన్నట్లు సమాచారం. మే 15వ తేదీ నాటికి అన్ని పనులను పూర్తి చేసి, మే 22న ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే సగభాగం సీజీ పనులు పూర్తవడంతో, మూవీ టీమ్ ఓటీటీ డీల్ కోసం కూడా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. ప్రస్తుతం జీ5, నెట్‌ఫ్లిక్స్ సంస్థలతో చర్చలు కొనసాగుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.



# ధురంధర్ – 2.. రెండు వేల కోట్ల మార్క్ అందుకోవడం అసాధ్యం



రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ దర్శకత్వంలో రూపొందిన భారీ యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద రికార్డుల వేట కొనసాగిస్తోంది. బాలీవుడ్ యాక్షన్ సినిమాల లెక్కలను తిరగరాస్తూ 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద ప్రభంజనం సృష్టిస్తోంది. రణవీర్ సింగ్ కెరీర్‌లోనే అత్యంత భారీ వసూళ్లు సాధించిన చిత్రంగా నిలిచిన ఈ సినిమా ప్రస్తుతం మూడవ వారంలో కూడా నిలకడగా కలెక్షన్లను రాబడుతోంది. ఇప్పటికే ప్రపంచవ్యాప్తంగా దాదాపు రూ. 1650 కోట్లు పైగా గ్రాస్ వసూళ్లను సాధించి 2026లో అత్యధిక వసూళ్లు రాబట్టిన భారతీయ చిత్రంగా రికార్డు సృష్టించింది.

తొలి వారంలోనే రికార్డు స్థాయి ఓపెనింగ్స్ సాధించిన ఈ చిత్రం దేశీయంగా రూ. 1000 కోట్ల మార్కును దాటిన తొలి హిందీ సినిమాగా చరిత్ర సృష్టించింది. కేవలం ఇండియాలోనే కాకుండా నార్త్ అమెరికా వంటి ఓవర్సీస్ మార్కెట్లలో కూడా అద్భుతమైన ప్రదర్శన కనబరుస్తోంది. మూడవ వారంలో అడుగుపెట్టినప్పటికీ, వర్కింగ్ డేస్‌లో కూడా సింగిల్ డిజిట్ పడిపోకుండా స్టడీగా వసూళ్లను రాబడుతున్నప్పటికి అయినప్పటికీ, ఫైనల్ రన్‌లో రూ. 2000 కోట్ల మార్కును అందుకోవడం ఒకింత కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సినిమా విడుదలై మూడు వారాలు గడవడంతో సహజంగానే థియేటర్ల సంఖ్య మరియు ఆక్యుపెన్సీ కొంత తగ్గింది. దానికి తోడు ఐపీఎల్ ప్రభావం కొంత మేర చూపిస్తోంది. రెండు వేల కోట్ల మార్కును చేరుకోవడానికి ఇంకా రూ. 350 కోట్లు రాబట్టాలి. ప్రస్తుత ట్రెండ్‌ను బట్టి చూస్తే ఈ స్థాయి వసూళ్లు సాధించాలంటే లాంగ్ రన్‌లో అద్భుతాలు జరగాలి. మొత్తానికి 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద ఒక గొప్ప విజయాన్ని అందుకుని భారతీయ సినిమా చరిత్రలో టాప్ 5 అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల్లో ఒకటిగా నిలవడం ఖాయం. రణవీర్ సింగ్ మాస్ పవర్ మరియు ఆదిత్య ధర్ టేకింగ్ ఈ చిత్రాన్ని మరో లెవల్‌కు తీసుకెళ్లాయని చెప్పాలి.

# బన్నీ 'రాకా' పెద్ద స్కెచ్చే.. కానీ 'శక్తి' పోట్లు?

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబోలో రాబోతున్న ప్రాజెక్ట్ అనౌన్స్‌మెంట్ నుంచే అంచనాలు ఆకాశాన్ని తాకాయి కానీ తాజాగా విడుదలైన టైటిల్ పోస్టర్ 'రాకా', అందులో బన్నీ ఊహించని డీగ్లామరైజ్డ్ లుక్ ఇప్పుడు సోషల్ మీడియాలో ఒక రేంజ్ చర్చకు దారితీసింది. స్టైలిష్ స్టార్‌గా పిలవబడే అల్లు అర్జున్‌ను అట్లీ Rawగా, మురికి పట్టిన దుస్తులు, గుండు, చెదిరిన జుట్టుతో చూపించడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. ఈ డీగ్లామరైజ్డ్ అవతార్‌పై కొందరు "అట్లీ ఏదో మ్యాజిక్ చేయబోతున్నాడు" అని ప్రశంసిస్తుంటే, మరికొందరు మాత్రం బన్నీని ఇలా చూడలేకపోతున్నామంటూ మిశ్రమంగా స్పందిస్తున్నారు.

అయితే 'రాకా' అనే పేరు వినగానే నెటిజన్లు జూనియర్ ఎన్టీఆర్ కెరీర్‌లో భారీ డిజాస్టర్‌గా నిలిచిన 'శక్తి' సినిమాను గుర్తు చేసుకుంటున్నారు. అందులో విలన్ పేరు 'రాకా' కావడంతో, యాంటీ ఫ్యాన్స్ ఆ పాత ఫ్లాప్ రిఫరెన్స్‌లను బయటకు తీసి ట్రోల్ చేయడం ప్రారంభించారు ఈ దెబ్బకు సోషల్ మీడియాలో 'శక్తి', 'మెహర్ రమేష్' వంటి హ్యాష్ ట్యాగ్‌లు మళ్లీ ట్రెండింగ్‌లోకి వచ్చాయి. అయితే తమ హీరో లుక్‌ను, టైటిల్‌ను కావాలనే టార్గెట్ చేస్తున్నారంటూ అల్లు అర్జున్ అభిమానులు గట్టిగానే కౌంటర్లు ఇస్తున్నారు. "అక్కడ ఉన్నది అట్లీ.. కమర్షియల్ ఎలిమెంట్స్‌తో బాక్సాఫీస్‌ను షేక్ చేయడం ఆయనకు వెన్నతో పెట్టిన విద్య" అని బన్నీ ఫ్యాన్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పటి విలన్ పేరు పెట్టినంత మాత్రాన సినిమా రిజల్ట్ మారిపోదని, ఇది సరికొత్త రికార్డులు సృష్టిస్తుందని వారు వాదిస్తున్నారు. అయితే ఈ 'రాకా' ట్రోలింగ్ బన్నీ సినిమాకు నెగటివ్ అవుతుందా లేక పబ్లిసిటీగా మారుతుందా అనేది కాలమే నిర్ణయించాలి!






# చిరు నిర్మాతతో నార్నె నితిన్ కొత్త ప్రాజెక్ట్

జూనియర్ ఎన్టీఆర్ బావమరిది నార్నె నితిన్ వరుసగా 'మ్యాడ్', 'మ్యాడ్ స్క్వేర్', 'ఆయ్' చిత్రాలతో విజయాలను అందుకుని మంచి గుర్తింపును సంపాదించారు. ఈయన కెరీర్ లో 'శ్రీశ్రీశ్రీ రాజావారు' చిత్రం మొదటగా ప్రారంభం అయింది. కానీ ఈ చిత్రం చాలా ఆలస్యంగా విడుదలై అపజయాన్ని అందుకుంది. ఇదిలా ఉండగా, ఈ యువ హీరో తన తదుపరి చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థలో చేయబోతున్నట్లు సమాచారం. తమిళ, తెలుగు చిత్ర పరిశ్రమల్లో వరుసగా సినిమాలు నిర్మిస్తున్న కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌లో నార్నె నితిన్ తన తదుపరి ప్రాజెక్ట్ చేయనున్నట్లు తెలుస్తోంది.

ఇప్పటికే ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన చర్చలు దాదాపు పూర్తయ్యాయని, మరికొద్ది రోజుల్లో దర్శకుడు సహా ఇతర వివరాలతో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉందని సమాచారం. ఈ నిర్మాణ సంస్థ ఇటీవల తమిళ స్టార్ హీరో విజయ్ ప్రధాన పాత్రలో రూపొందిన 'జన నాయగన్' చిత్రాన్ని నిర్మించింది. అయితే ఈ సినిమా విడుదల విషయంలో పలు సవాళ్లు ఎదుర్కొంటుంది. ఇక ఇదే నిర్మాణ సంస్థ మెగాస్టార్ చిరంజీవితో కూడా ఓ భారీ చిత్రాన్ని రూపొందించేందుకు సిద్ధమవుతోంది. బాబీ కొల్లి దర్శకత్వంలో రూపొందనున్న ఈ చిత్రం ప్రారంభ కార్యక్రమం మరికొద్ది రోజుల్లో జరగనున్నట్లు తెలుస్తోంది. ఈ కార్యక్రమానికి పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరవనున్నట్లు సమాచారం.



# బ్లాక్‌బస్టర్‌కు నీకంటే ఎవరూ అర్హులు కారు





కొన్ని రోజుల నుంచి సోషల్ మీడియాలో 'డెకాయిట్' సందడి కనిపిస్తోంది. అడివి శేష్ హీరోగా షానియల్ డియో తెరకెక్కించిన ఈ చిత్రం ఏప్రిల్ 10న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో టీమ్‌కు అందరూ ఆల్ ది బెస్ట్ చెబుతున్నారు. తాజాగా నటి సమంత టీమ్‌పై ప్రశంసలు కురిపించారు. ఈ చిత్ర నిర్మాత సుప్రియను ఉద్దేశించి ఇన్‌స్టాలో స్టోరీ పెట్టారు.

''సుప్రియ.. 'డెకాయిట్' కోసం నువ్వు పడిన కష్టం, నీ పట్టుదల, సినిమాపై నీకున్న అంకితభావం అన్నీ నేను స్వయంగా చూశాను. బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకోవడానికి నీకంటే ఎవరూ అర్హులు కారు. దేవుడి ఆశీ […]

[…] అని సమంత అన్నారు. 'డెకాయిట్' విజయం సాధించాలని కోరుకుంటూ టీమ్‌కు ముందుగానే శుభాకాంక్షలు తెలిపారు. రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. శేష్ సరసన మృణాల్ […]

[…] దర్శకుడు అనురాగ్ కశ్యప్ విలన్‌గా కనిపించనున్నారు. విడుదల తేదీ ప్రకటించిన నాటినుంచి చిత్రబృందం జోరుగా ప్రచారం చేసి సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. టీజర్, ట్రైలర్ ఆకట్టుకునేలా ఉండడంతో దీనిపై […]

# దసరా రిలీజ్ కోసం స్పీడ్ పెంచిన 'ఫౌజీ' టీమ్

రెబల్ స్టార్ ప్రభాస్ ప్రస్తుతం 'ఫౌజీ' చిత్రంలో హీరోగా నటిస్తున్నారు. దర్శకుడు హను రాఘవపూడి తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో ఇమాన్వి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ సినిమా షూటింగ్ ప్రారంభమై ఇప్పటికే చాలా కాలం గడిచింది. ప్రభాస్ ఈ చిత్రంతో పాటు ఇతర ప్రాజెక్టుల షూటింగ్స్‌లో కూడా పాల్గొనడం వల్ల ఈ సినిమా చిత్రీకరణ కొంత నెమ్మదిగానే సాగింది. మొదటి నుంచే ఈ చిత్రాన్ని ఈ ఏడాది దసరా సందర్భంగా విడుదల చేయాలని మేకర్స్ లక్ష్యంగా పెట్టుకున్నారు. అందుకు అనుగుణంగానే ప్రస్తుతం షూటింగ్ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి.దసరా […]

[…] లో మూవీ టీమ్ షూటింగ్ స్పీడ్‌ను మరింత పెంచినట్లు సమాచారం. దసరా రిలీజ్‌ను లక్ష్యంగా పెట్టుకుని దర్శకుడు హను రాఘవపూడి మెయిన్ కాస్ట్‌పై కీలక సన్నివేశాలను చిత్రీకరిస్తుండగా, సెకండ్ యూనిట్ భారీ యాక్షన్ ఎపిసోడ్‌ను తెరకెక్కిస్తున్నట్లు తెలుస్తుంది. ఇలా రెండు యూనిట్లుగా షూటింగ్ నిర్వహిస్తూ చిత్రీకరణను త్వరితగతిన పూర్తి చేసే దిశగా మూవీ బృందం పనిచేస్తున్నట్లు సమాచారం. ఈ చిత్రంలో అనుపమ్ ఖేర్, మిథున్ చక్రవర్తి, జయప్రద కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ బ్యానర్‌పై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.




The imprint line should be printed legibly as Printed by Published by BADHE JAYASHREE on behalf of BADHE JAYASHREE, printed at and published at PLOT NO. 104, KAPIL KAUSALYA APARTMENT, SHILPA CERENY COUNTY VENCHER, POTHIREDDYPALLY editor BADHE JAYASHREE.